thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 211 | జగిత్యాల శనివారం 14 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

వీస్ చేతిలో టీమిండియా చిత్తు



11



ప్రపంచ మేధోమథనానికి భాగ్యనగరం వేదిక!

భారత్ సమ్మిట్-2026 తొలిరోజు కీలక చర్చలు

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్-2026' తొలిరోజు కార్యక్రమాలు శుక్రవారం విజయవం తంగా కొనసాగాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక అంశాలపై ప్రత్యేక ప్యానల్ చర్చలు జరిగాయి. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక సమానత్వం, సంక్షేమ పథకాల అమలు ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి.

'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు ప్రత్యేక సమావేశాలు

- 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు ప్రత్యేక సమావేశాలు
- ఫ్యూచర్ సిటీ, పట్టణాభివృద్ధిపై మంత్రి శ్రీధర్‌బాబు వివరణ
- ఆర్థిక, సామాజిక న్యాయం.. సంక్షేమ విధానాలపై చర్చలు
- తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలపై అంతర్జాతీయ ప్రతినిధుల దృష్టి
- రెండో రోజు సహకార సమాఖ్యవాదం, ఎన్నికల సమగ్రతపై చర్చలు
- నేడు హాజరుకానున్న రాహుల్‌గాంధీ

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్-2026' తొలిరోజు కార్యక్రమాలు శుక్రవారం విజయవంతంగా కొనసాగాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక అంశాలపై ప్రత్యేక ప్యానల్ చర్చలు జరిగాయి. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వివరాలు 2 లో



యూనిఫామ్‌లో క్రిమినల్!

- సజ్జనార్‌పై సీబీఐ మాజీ డైరెక్టర్ సంచలన వ్యాఖ్యలు
- ఒక సహోద్యోగిపై ఇలా చెప్పడం బాధాకరమే
- కానీ ఇదే నూటికి నూరు శాతం వాస్తవం
- బదిలీ చేస్తే సరిపోదు.. సమగ్ర విచారణ జరపాలి
- సీఎం, డీజీపీ నిర్ణయానికి నాగేశ్వరరావు ధన్యవాదాలు

2

మహిళా ఎస్సై అక్రమ వసూళ్లపై సజ్జనార్ ఆగ్రహం

2

ప్రొబేషనరీ కాలం పూర్తికాకముందే సస్పెన్షన్ వేటు

ఏసీబీ వలకు చిక్కుతున్న పలువురు పోలీసు అధికారులు

పెట్టుబడులకు తెలంగాణే గమ్యం



ప్రపంచానికి చాటేందుకే భారత్ సమ్మిట్!

- రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- డిసెంబర్ 7 నుంచి ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణకు విదేశీ ప్రతినిధులే బ్రాండ్ అంబాసిడర్లు కావాలి
- గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక విధానం
- రాహుల్‌గాంధీని ఆహ్వానించాం.. సదస్సుపై దుష్ప్రచారం తగదు
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం

2



చేవెళ్లలో ఆర్మీ వాహనం బోల్తా

3

14 మంది జవాన్లకు గాయాలు

ఎనిమిది మంది పరిస్థితి విషమం

కారును తప్పించబోయి చెట్టును ఢీకొన్న వాహనం

టీజీ టెట్ నోటిఫికేషన్ విడుదల

జనవరి 3 నుంచి 15 వరకు పరీక్షలు

నవంబర్ 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

2



ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

- భూగర్భ జలాల పరిస్థితిపై ఉత్తమ్ సమీక్ష ■15న మోదీతో భేటీ
- కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్న సీఎం, మంత్రి
- జల సంరక్షణకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు

3



అండాల సేకరణ దందా గుట్టురట్టు

- ఫెర్టిలిటీ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు
- బేగంపేట హాస్టల్‌లో 12 మంది మహిళలకు విముక్తి
- రూ.50 వేల ఆశచూపి ఇతర రాష్ట్రాల నుంచి తరలింపు
- ప్రమాదకర హార్మోన్ ఇంజెక్షన్లతో మహిళల ఆరోగ్యానికి ముప్పు

2



ఒక నగ్న ఫొటోకు.. ఓ యుద్ధ ప్లాన్ లీక్



- పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం!
- పాక్ యువతి వలపు వలలో చిక్కుకుని దేశ రహస్యాలను తాకట్టు పెట్టిన వింగ్ కమాండర్
- సబ్‌ఆర్డినేట్‌ల ఫోన్లలోనూ మాల్‌వేర్ యాప్ ఇన్‌స్టాల్ చేయించిన నిందితుడు

4

మహిళా కోటాపై కేంద్రం పట్టు

- మరోసారి డీలిమిటేషన్ బిల్లు!
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తామన్న ధీమా
- అవసరమైన మెజారిటీ కంటే 15-18 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా
- లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచే ప్రతిపాదన

4



మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: రాహుల్ గాంధీ

- ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ
- ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య
- మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్
- ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు

2





యూనిఫామ్‌లో క్రిమినల్!

సజ్జనార్‌పై సీబీఐ మాజీ డైరెక్టర్ సంచలన వ్యాఖ్యలు

ఒక సహోద్యోగిపై ఇలా చెప్పడం బాధాకరమే

కానీ ఇదే నూటికి నూరు శాతం వాస్తవం

బదిలీ చేస్తే సరిపోదు.. సమగ్ర విచారణ జరపాలి

సీఎం, డీజీపీ నిర్ణయానికి నాగేశ్వరరావు ధన్యవాదాలు

హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు) : తెలంగాణలో సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ బదిలీ వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆయన బదిలీపై స్పందిస్తూ సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో పోలీసు కమిషనర్‌గా పనిచేసిన సజ్జనార్‌ను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అయితే ఈ సందర్భంగా సజ్జనార్‌పై ఆయన వాడిన పదజాలం, చేసిన ఆరోపణలు పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎక్స్ వేదికగా స్పందించిన నాగేశ్వరరావు.. సజ్జనార్‌ను ఉద్దేశించి 'యూనిఫామ్‌లో ఉన్న క్రిమినల్' అంటూ అత్యంత తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఒక మాజీ సహోద్యోగిపై ఇలాంటి బహిరంగ ఆరోపణలు చేయడం తనకు వ్యక్తిగతంగా ఎంతో బాధ కలిగిస్తోందని, కానీ వాస్తవాలను దాచలేనని ఆయన కుండబద్దలు కొట్టారు. సజ్జనార్ తీరుపై ఆయన చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు అటు రాజకీయ, ఇటు అధికార వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

కేవలం బదిలీ ఏమాత్రం శిక్ష కాదు..

ఒక అధికారిని కేవలం ఒక పోస్టు నుంచి మరో పోస్టుకు బదిలీ చేయడం ఏమాత్రం శిక్ష కిందకు రాదని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బదిలీల వల్ల వ్యక్తుల్లోని నేర స్వభావం, వారి ప్రవర్తన ఏమాత్రం మారిపోవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. యూనిఫామ్ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సజ్జనార్‌పై గతంలో వచ్చిన ఆరోపణలు, ఆయన తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, చేసినట్లుగా చెబుతున్న చట్టవ్యతిరేక చర్యలపై ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా జరిగే ఈ విచారణలో ఆయన తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే, చట్టప్రకారం అత్యంత కఠినమైన శిక్ష విధించాలని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబడాలంటే ఇలాంటి వ్యవహారాలపై లోతైన దర్యాప్తు జరిపి తీరాల్సిందేనని నాగేశ్వరరావు తన పోస్టులో కుండబద్దలు కొట్టారు.

మహిళా ఎస్సై అక్రమ వసూళ్లపై సజ్జనార్ ఆగ్రహం

ప్రొబేషనరీ కాలం పూర్తికాకముందే సస్పెన్షన్ వేటు

ఏసీబీ వలకు చిక్కుతున్న పలువురు పోలీసు అధికారులు

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు సిబ్బందిలో కొందరు అక్రమ వసూళ్లు, లంచాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతుండటం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో వరుసగా అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కుల్సుంపుర సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 2024 బ్యాచ్ మహిళా ఎస్సై వ్యవహారంపై పోలీసు కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు వసూలు చేయడంతోపాటు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు మహిళా ఎస్సైపై ఫిర్యాదులు అందాయి. దీంతో ఆమెను సస్పెండ్ చేసి హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఆమెకు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లపైనా క్రమశిక్షణ చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో 15 రోజుల వ్యవధిలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై వేర్వేరు లంచం కేసుల్లో ఏసీబీకి పట్టుబడ్డారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రావు, ఓ కానిస్టేబుల్ సివిల్ వివాదంలో రూ.3 లక్షలు తీసుకుంటూ పట్టుబడగా, బంజారాహిల్స్ ఎస్సై విజయ్ రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేసిన కేసులో అరెస్టయ్యారు. ఫిల్మ్‌నగర్‌లో బైకిస్ట్‌పై దాడి చేసి నగదు, బంగారం దోచుకున్న ఘటనలో పోలీసు సిబ్బంది అరెస్టయ్యారు. సైఫాబాద్‌లోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకోగా, సనత్‌నగర్‌లో వాహనదారుడి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టుబడ్డారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

టీజీ టెట్ నోటిఫికేషన్

జనవరి 3 నుంచి 15 వరకు పరీక్షలు

నవంబర్ 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): హైదరాబాద్, నవంబర్ 13: తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్) నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శుక్రవారం ఈ ప్రకటన చేశారు. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 15 వరకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈ నెల 16 నుంచి డిసెంబర్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి నోటిఫికేషన్, ఇన్ఫర్మేషన్ బులెటిన్ ఈ నెల 16 నుంచి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. పరీక్షకు సంబంధించిన అర్హతలు, పేపర్-1, పేపర్-2 సిలబస్, దరఖాస్తు రుసుము, పరీక్షా కేంద్రాల వివరాలను ***https://schooledu.telangana.gov.in*** వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లోని నిబంధనలు పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని నవీన్ నికోలస్ తెలిపారు.

ప్రపంచ మేధోమథనానికి భాగ్యనగరం వేదిక!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక సమానత్వం, సంక్షేమ పథకాల అమలు ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి. 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' నినాదంతో అంతర్జాతీయ వేదిక: 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్-2026 రెండో ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిణామాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం, కృత్రిమ మేధ (ఏఐ), వాతావరణ మార్పులు వంటి కీలక అంశాలు ప్రధాన ఎజెండాగా నిలిచాయి. వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, మాజీ ప్రధానులు, మాజీ మంత్రులు, గవర్నర్లు, ఎంపీలు, రాయబారులు, విధాన నిర్ణేతలు, మేధావులు, సామాజికవేత్తలు ఈ వేదికపై తమ ఆలోచనలను పంచుకుంటున్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేకంగా 'తెలంగాణ రైజింగ్' పేరుతో చర్చలు నిర్వహిస్తున్నారు. పట్టణీకరణ, ఆర్థిక-సామాజిక న్యాయంపై మంత్రుల ప్రసంగాలు:తొలిరోజు పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై జరిగిన తొలి ప్యానల్ చర్చలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. పట్టణీకరణ, భవిష్యత్ అవసరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించడంతో పాటు ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను మంత్రి ఆవిష్కరించారు. 'ఆర్థిక న్యాయం' అంశంపై జరిగిన రెండో ప్యానల్ చర్చలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని ఆర్థిక అసమానతలు, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాల్సిన అవసరం, సమాన అవకాశాల కల్పనపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. మూడో అంశంగా జరిగిన సామాజిక న్యాయంపై ప్యానల్ చర్చలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని, తెలంగాణలో సామాజిక న్యాయం అమలు తీరుతో పాటు బీసీలు, ఇతర వెనుకబడిన



వర్గాలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఇక నాలుగో ప్యానల్‌గా జరిగిన సంక్షేమ విధానాలపై చర్చలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వారి సామాజిక ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

రెండో రోజు కార్యక్రమాలకు రాహుల్‌గాంధీ రాక

ఈ సమ్మిట్‌కు వివిధ దేశాల నుంచి రావాల్సిన ప్రతినిధుల్లో కొందరు చివరి నిమిషంలో హాజరుకాలేకపోవడంపై నిర్వాహకులు కొంత ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇక రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా మరో నాలుగు 'తెలంగాణ రైజింగ్' అంశాలపై చర్చలు జరగనున్నాయి. సహకార సమాఖ్యవాదం, సంస్కృతి-సమాజం, యువత-క్రీడలు-రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలు చర్చకు రానుండగా, అంతర్జాతీయ ప్రతినిధులు వీటిపై తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకోనున్నారు. రెండో రోజు కార్యక్రమాలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సహా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

పెట్టుబడులకు తెలంగాణే గమ్యం

- ప్రపంచానికి చాటేందుకే భారత్ సమ్మిట్!
- రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- డిసెంబర్ 7 నుంచి ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణకు విదేశీ ప్రతినిధులే బ్రాండ్ అంబాసిడర్లు కావాలి
- గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక విధానం
- రాహుల్‌గాంధీని ఆహ్వానించాం.. సదస్సుపై దుష్ప్రచారం తగదు
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం



హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన మౌలిక సదుపాయాలు, సమృద్ధిగా ఉన్న మానవ వనరులు, పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం నేపథ్యంలో తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని ప్రపంచానికి చాటిచెప్పడానికే ప్రభుత్వం 'భారత్ సమ్మిట్' నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ సదస్సు నేపథ్యంలో శుక్రవారం బోధి పెవిలియన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలు పాల్గొన్నారు.వచ్చే నెల డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు సన్నాహకంగా, తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితులను ప్రపంచానికి వివరించేందుకే ఈ భారత్ సమ్మిట్ ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో తమ ప్రభుత్వం అత్యంత స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ సదస్సుకు జాతీయ స్థాయి ప్రముఖులే కాకుండా దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతినిధులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు కలిపి సుమారు వెయ్యి మంది హాజరయ్యారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే సెమినార్లు, చర్చలు, తీర్మానాల ద్వారా తెలంగాణలోని ప్రజాస్వామిక, పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామన్నారు. సదస్సు ముగిశాక తిరిగి వెళ్లే ఈ అంతర్జాతీయ ప్రతినిధులందరూ తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

గిగ్ వర్కర్లకు రక్షణగా దేశంలోనే అత్యుత్తమ పాలసీ

సదస్సులో ప్రధానంగా పర్యావరణం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి కీలక అంశాలపై మేధో మథనం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారానే ఉత్తమ విధానాలను రూపొందించవచ్చన్నారు. ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. ప్లాట్‌ఫామ్ వర్కర్లు, కొరియర్లు, డ్రైవర్లు, ఇళ్లల్లో పనిచేసే కార్మికులకు సరైన సామాజిక భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం, రక్షణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ 'గిగ్ వర్కర్స్ పాలసీ'ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ పాలసీ ఆవిష్కరణ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ప్రత్యేకంగా ఆహ్వానించామని, భారత్ సమ్మిట్‌లోనూ ఆయన పాల్గొని తన సందేశాన్ని వినిపిస్తారని వెల్లడించారు.

అర్థరహిత ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు

ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా ఆహ్వానించామని సీఎం గుర్తుచేశారు. గతంలో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ సైతం ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని దేశ ప్రతినిధిగా విదేశాలకు పంపించిన సత్సాంప్రదాయాన్ని ప్రస్తావించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని ముఖ్యమంత్రి హితవు పలికారు. అర్థరహితమైన ఆరోపణలు, దుష్ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని కోరారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి, యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి, సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ సాధించిన ప్రగతిని ప్రపంచానికి చాటిచెప్పడానికి ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు ఎవరూ అడ్డుపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: రాహుల్ గాంధీ

ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ

ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య

మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్

ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 13 (చురకలు): ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలపై ప్రధాని బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు. విదేశీ శక్తుల నియంత్రణలో ప్రధాని మోదీ ఉన్నారంటూ గతంలో చేసిన ఆరోపణలకు ఆధారాలేమిటని ఓ వ్యక్తి ప్రశ్నించగా.. తన ఫోన్‌ను చూపిస్తూ అందులోనే ఆధారాలున్నాయని రాహుల్ పేర్కొన్నారు. తన ఫోన్ ట్యాప్ అవుతున్న విషయం ప్రధానికీ తెలుసని వ్యాఖ్యానించారు. మోదీ చర్చకు వస్తే ఎవరు విదేశీ శక్తుల ప్రభావంలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు? అనే అంశాలతో పాటు తనకు తెలిసిన పలు విషయాలు బయటపడతాయని అన్నారు. ప్రధానితో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని రాహుల్ స్పష్టం చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో బహిరంగ చర్చకు రావాలని మోదీకి సవాల్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాజా ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు రాజకీయంగా చర్చకు దారితీశాయి.



అక్రమ అండాల సేకరణ దందా గుట్టురట్టు

ఫెర్టిలిటీ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు

బేగంపేట హాస్టల్‌లో 12 మంది మహిళలకు విముక్తి

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): నగరంలో అక్రమ అండాల సేకరణ దందా వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ప్రముఖ ఫెర్టిలిటీ కేంద్రాలైన ఒయాసిస్, సద్గురు సెంటర్లపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సద్గురు హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంస్థ డైరెక్టర్ డాక్టర్ గేదెల దుర్గారావుతో పాటు పలువురు ఏజెంట్లపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. బేగంపేటలోని అమి నీతా గర్ల్స్ హాస్టల్‌పై పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి వివిధ రాష్ట్రాలకు చెందిన 12 మంది మహిళలను రక్షించారు. నిరుపేద మహిళలకు రూ.50 వేలు ఇస్తామంటూ ఆశచూపి ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించినట్లు విచారణలో వెల్లడైంది. వైద్య పర్యవేక్షణ, నిబంధనలు లేకుండానే వారికి ప్రమాదకరమైన హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు గుర్తించారు. అండాల సేకరణలో ఏడు కంటే తక్కువ అండాలు వస్తే ఏజెంట్ల కమీషన్‌లో 50 శాతం కోత విధించేవారని తేలింది. ఎక్కువ అండాలు పొందాలనే ఉద్దేశంతో మహిళలకు పరిమితికి మించి హార్మోన్ డోసులు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటివరకు ఈ ముఠా సుమారు 66 మంది మహిళల నుంచి అండాలను సేకరించినట్లు అధికారులు గుర్తించారు. వీరిలో 19 మందికి సంబంధించిన రికార్డులను పూర్తిగా మాయం చేసినట్లు తేలింది. అనుమతులు లేని గచ్చిబౌలి, ఉప్పల్, మలక్‌పేట, టోలీచౌకీలోని క్లినిక్‌లకు అండాలను సరఫరా చేసినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై బీఎన్ఎస్, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) చట్టాల కింద క్రైమ్ నంబర్ 426/2026తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న అమిత్ శర్మ, నిఖత్ శర్మ, దీపిక సహా తొమ్మిది మంది ఏజెంట్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో కీలక పరిణామాలు: రేవంత్

- కేసులో అనూహ్య మలుపులు ఉంటాయని వెల్లడి
- మోదీతో భేటీ ఖేలో ఇండియా ఆహ్వానం కోసమే
- మియాపూర్ భూముల వేలంపై బీఆర్ఎస్ హెచ్చరికల వెనుక డబ్బులే లక్ష్యం
- కవిత ఇంటిపై డ్రోన్ ఎవరు ఎగరేశారో తెలియదు
- కిషన్‌రెడ్డిని ఆహ్వానించకపోవడానికి కారణం చెప్పిన సీఎం



హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): హైదరాబాద్, నవంబర్ 13: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ కేసు కీలక మలుపులు తిరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. కేంద్ర ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేసినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, తాను మాట్లాడే ప్రతి విషయం బహిరంగంగానే ఉంటుందని వ్యాఖ్యానించారు.

కవిత ఇంటిపై డ్రోన్ ఎవరు ఎగరేశారో తెలియదు

ఖేలో ఇండియా క్రీడా పోటీలకు ఆహ్వానించేందుకే ఎల్లుండి ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామని బీఆర్ఎస్ చేస్తున్న హెచ్చరికల వెనుక ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. గతంలో ఉద్యమ సమయంలో ల్యాంకో హిల్స్, పద్మాలయ భూముల విషయంలో బీఆర్ఎస్ పెద్దఎత్తున ఆందోళనలు చేసిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి విషయంలో డబ్బులు వసూలు చేసి మౌనం వహించిందని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత నివాసంపై డ్రోన్ ఎగరేసింది ఎవరనేది తనకు తెలియదని సీఎం స్పష్టం చేశారు. కవిత కుటుంబంలో జరుగుతున్న వివాదాల నేపథ్యంలోనే ఏదైనా జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఆ కుటుంబ సభ్యులే ఈ వ్యవహారాన్ని పరిష్కరించుకుంటారని పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డిని అందుకే ఆహ్వానించలేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచుకుంటే అది ఆయన మోకాళ్లకు అడ్డం వస్తుందే తప్ప తనకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారతీయుల ఆత్మ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు బీజేపీ లేదని, మరో 25 ఏళ్ల తర్వాత ఆ పార్టీ ఉనికి కూడా ఉండదని వ్యాఖ్యానించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్' కార్యక్రమానికి ఆహ్వానించినప్పటికీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరుకాలేదని సీఎం తెలిపారు. అందుకే భారత్ సమిట్‌కు వారిని ఆహ్వానించలేదని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి వస్తానంటే తానే స్వయంగా వెళ్లి ఆహ్వానిస్తానని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

నిరుద్యోగులపై పోలీసుల దాడులప్పుడు ఎక్కడున్నారు?

- లగచర్లలో గిరిజన మహిళలను అవమానించినప్పుడు మీకు పట్టింపులేదు
- హెచ్‌సీయూ భూముల్లో చెట్లను నరికినా మీకు కనబడలేదు
- కేబీఆర్ పార్కును నాశనం చేస్తుంటే నోరు మెదపలేదు
- రాహుల్ ను ప్రశ్నించిన కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ విద్యార్థులను పోలీసులతో గొంతు నులిమి, దాడులు చేయించినప్పుడు మీరు ఎక్కడున్నారు రాహుల్ గాంధీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. లగచర్లలో గిరిజన మహిళలను వారి భూముల కోసం పోరాడుతున్నందుకు కొట్టినప్పుడు, దుస్తులు చింపి అవమానించినప్పుడు మీకు చలనం కలగలేదా? హైడ్రా బుల్డోజర్లతో కష్టపడి జీవిస్తున్న తెలంగాణ ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు మీరు ఢిల్లీలో నిద్రపోతున్నారా? కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో రాత్రికి రాత్రే 10 వేలకు పైగా చెట్లను నరికివేసి, జింకలు, నెమళ్లు సహా విలువైన జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసినప్పుడు.. కేబీఆర్ పార్కును నాశనం చేస్తున్నప్పుడు మీ గొంతు ఎందుకు పెగల్లేదు?రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను అపహాస్యం చేస్తూ, పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పుడు మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? మహిళా ప్రజాప్రతినిధుల చీరలు లాగి, అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు కనీసం ఒక్క మాటైనా మాట్లాడారా రాహుల్ గాంధీ? రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలు, అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల అరెస్టులు, కార్పొరేట్ అనుకూల విధానాలు, భూకబ్జాలపై మాట్లాడటానికి మీకు సమయం లేదా? మీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే బహిరంగంగా అవినీతి గురించి మాట్లాడుతున్నారు. అయినా మీ నోరు ఎందుకు మెదపడం లేదు? అవసరమైనప్పుడు మౌనం వహించారు.. ఇప్పుడు మాత్రం తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100 కోట్లతో ప్రచార ఆర్భాటం కోసం సిగ్గులేకుండా వచ్చారా? రాహుల్ గాంధీ గారూ.. రాష్ట్ర ప్రజల సొమ్ముతో ఈ ప్రచార పర్యటనలు చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారు? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం

- ప్రజా అవసరాల భూములను అమ్మే అధికారం ప్రభుత్వానికి లేదు
- 2013లో కాపాడిన భూములను మళ్లీ వేలం వేయడం దుర్మార్గం
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): ప్రజా అవసరాల కోసం కేటాయించిన కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటామని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు హెచ్చరించారు. మూసాపేటలోని ట్రక్ పార్క్ భూములను శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి పరిశీలించారు. స్థానికులు, ట్రక్ డ్రైవర్లు, కార్మికుల సమస్యలు తెలుసుకుని అనంతరం నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను అమ్మేందుకు ప్రయత్నించినప్పుడు బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం కలిసి పోరాడి అడ్డుకున్నాయని గుర్తుచేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క గజం భూమి కూడా విక్రయించలేదని, ప్రజా అవసరాల కోసం పోలీస్ స్టేషన్లు, హెచ్ఎండీఏ నర్సరీ, ఆర్టీఓ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ట్రక్ పార్కింగ్‌కు కేటాయించామని తెలిపారు. ఈ నెల 27న వేలం నిర్వహించేందుకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చిందని, సర్వే నంబర్లు 121/ూ నుంచి 141 వరకు, 146, 147, 155, 156, 157లోని భూములను అమ్మకానికి పెట్టిందని చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ట్రక్ పార్కింగ్, నర్సరీ, ఆర్టీఓ కార్యాలయానికి కేటాయించిన స్థలాలు కూడా వేలం జాబితాలో ఉన్నాయని ఆరోపించారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల మధ్య ఉన్న ఈ స్థలం చుట్టుపక్కల ప్రస్తుతం 10 లక్షల మంది నివసిస్తున్నారని, భవిష్యత్తులో జనాభా మరింత పెరగనుందని పేర్కొన్నారు. రోజూ వందలాది లారీలు, కంటైనర్లకు ఈ పార్కింగ్ స్థలం అవసరమని తెలిపారు. 1982లో ఎస్సీ, ఎస్టీ, పేద రైతుల నుంచి ప్రజా ప్రయోజనాల కోసం ఈ భూములను సేకరించారని, వాటిని ఇతర అవసరాలకు వినియోగించరాదని భూసేకరణ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులో హెచ్ఎండీఏ అఫిడవిట్ల ద్వారా వెల్లడించిందని గుర్తుచేశారు. ఇప్పుడు వేలం వేయడం చట్టపరంగా ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. భూములను విక్రయించే బదులు ఆసుపత్రి, పార్కు, విద్యాసంస్థలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల విక్రయాలపై కూడా హరీశ్ రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు, మియాపూర్ భూములు, హౌసింగ్ బోర్డు స్థలాలు సహా వివిధ ప్రభుత్వ భూములను విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని, లేదంటే బీఆర్ఎస్, వామపక్షాలతో కలిసి న్యాయపోరాటం సహా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు, సీపీఐ, సీపీఎం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా

దేశంలోనే తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని, దేశంలోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఉపాధి పొందుతున్న వ్యక్తి మరణిస్తే ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలన్నదే పథకం ఉద్దేశమన్నారు. ప్రతి కుటుంబంలో ఒక ఉపాధి పొందే వ్యక్తికి బీమా వర్తిస్తుందని, పలువురు ఉపాధిలో ఉంటే ఎవరికి బీమా కల్పించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. ఒకరు లేదా పలువురు నామినీలను ఎంపిక చేసుకోవడంతోపాటు బీమా మొత్తాన్ని ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలన్నది కూడా వారే నిర్ణయించుకోవచ్చన్నారు.ఈ నెల 19 నుంచి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఏకకాలంలో లబ్ధిదారుల నమోదు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. నమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, కుటుంబ సభ్యులకు వివరాలు చదివి



వినిపించి వారి అంగీకారం తీసుకోవాలని సూచించారు. పథకంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని, నమోదు కేంద్రాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సామాజిక, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు.



చేవెళ్లలో ఆర్మీ వాహనం బోల్తా

14 మంది జవాన్లకు గాయాలు.. ఎనిమిది మంది పరిస్థితి విషమం

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అల్లావాడ గేట్ సమీపంలో శుక్రవారం ఆర్మీ వాహనం ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 14 మంది జవాన్లు తీవ్రంగా గాయపడగా, వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గోల్కొండ ఆర్మీ క్యాంపు నుంచి శిక్షణలో భాగంగా షాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అల్లావాడ గేట్ సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారును తప్పించబోయి డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్మీ వాహనం పలుమార్లు బోల్తాపడి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం తీవ్రంగా దెబ్బతినగా, అందులో ఉన్న జవాన్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను బయటకు తీసి అంబులెన్స్‌ల ద్వారా శంషాబాద్‌లోని ఆర్కానో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో చేవెళ్ల ప్రధాన రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వాహనాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

భూగర్భ జలాల పరిస్థితిపై ఉత్తమ్ సమీక్ష

ఈ నెల 15న ప్రధాని మోదీతో భేటీ

కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్న సీఎం, మంత్రి

జల సంరక్షణకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు



హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల పరిస్థితిపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సచివాలయంలో భూగర్భ జల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో సీఎస్ఐఆర్-ఎన్ఈఐఎస్‌టీ డైరెక్టర్, భూగర్భ జలాల నిపుణుడు డాక్టర్ వీరేంద్ర ఎం. తివారీ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలవనున్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, దాని ప్రభావాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి, ముప్పును ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నీటిమట్టాలు తగ్గుతున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు తక్షణ, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల సలహాలను కూడా కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆటో రిక్షా కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు

ఆటో నగర్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం

రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): నగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో రిక్షా కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలోని పేద, బలహీనవర్గాలకు సొంతింటి భరోసా కల్పించడంతోపాటు, గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న ఆటోరిక్షా కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆటో నగర్ కాలనీ పేరుతో సరసమైన గృహ నిర్మాణ పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. నిరంతరం ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ నగర జీవనంలో కీలక భాగస్వాములుగా ఉన్న ఆటో కార్మికుల కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.హైదరాబాద్ కోర్ పరిధిలోని బండ్లగూడ, గండిపేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మిగూడ ప్రాంతాల్లో ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో 500 ఫ్లాట్ల చొప్పున మొత్తం 2,000 ఆధునిక ఫ్లాట్లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో స్థలాల లభ్యత, సాంకేతిక అంశాలు, భౌగోళిక అనుకూలతలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించడంతోపాటు ఆర్థిక ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని హౌసింగ్ బోర్డు అధికారులను ఆదేశించినట్లు మంత్రి వివరించారు. అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేసి అర్హులైన ఆటో కార్మిక కుటుంబాలకు వీలైనంత త్వరగా గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమమే ప్రాధాన్యంగా వివిధ వర్గాల అవసరాలను గుర్తించి ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఆటోరిక్షా కార్మికుల కోసం ఆటో నగర్ కాలనీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంపాదకీయం



సంక్షేమ పంపిణీలో నవశకం!

నిధుల పక్కదారికి ఈ-రూపీతో పూర్తి అడ్డుకట్ట

బ్యాంకు ఖాతా, ఇంటర్నెట్ లేకున్నా ప్రయోజనం

లబ్ధిదారుడి ఫోన్‌కే నేరుగా డిజిటల్ వోచర్

నిర్దేశించిన అవసరానికి మాత్రమే వాడుకునే వీలు

సైబర్ భద్రత, డిజిటల్ అవగాహనే కీలకం

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు భారత్ శరవేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో సంక్షేమ పథకాల అమలులో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వం పేదల కోసం ఒక్క రూపాయి విడుదల చేస్తే దళారుల చేతివాటంతో లబ్ధిదారుడికి కేవలం పదిహేను పైసలు మాత్రమే చేరేవన్న విమర్శలు ఉండేవి. ఆ తర్వాత వచ్చిన జన్‌ధన్, ఆధార్, మొబైల్ (జామ్) అనుసంధానంతో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానం అమల్లోకి వచ్చి మధ్యవర్తుల బెడద తప్పింది. అయితే బ్యాంకు ఖాతాల్లో నేరుగా పడుతున్న నగదు నిజంగానే నిర్దేశించిన ప్రయోజనం కోసమే ఖర్చవుతోందా అన్నది ఇప్పటికీ పెద్ద ప్రశ్నగానే మిగిలిపోయింది. సరిగ్గా ఈ లోపాన్ని సవరించి, సంక్షేమ పంపిణీలో నూటికి నూరు శాతం పారదర్శకత తెచ్చేందుకే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆధ్వర్యంలో 'ఈ-రూపీ' అనే సరికొత్త డిజిటల్ వోచర్ వ్యవస్థ రూపుదిద్దుకుంది. ప్రభుత్వమైనా, ప్రైవేటు సంస్థలైనా తాము అందించాలనుకున్న ఆర్థిక సహాయాన్ని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం మాత్రమే వినియోగించేలా లబ్ధిదారులకు ఈ ప్రీపెయిడ్ వోచర్లను జారీ చేయవచ్చు.

అసలు ఎలా పనిచేస్తుంది..

ఈ-రూపీ అనేది పూర్తిగా నగదు రహిత, కాంటాక్ట్‌లెస్ డిజిటల్ చెల్లింపుల వేదిక. ఇందులో లబ్ధిదారుడి మొబైల్ ఫోన్‌కు నేరుగా ఒక క్యూఆర్ కోడ్ లేదా ఎస్ఎంఎస్ ట్రింగ్ రూపంలో ఈ-వోచర్ వస్తుంది. దీనికున్న అతిపెద్ద ప్రత్యేకత ఏమిటంటే.. లబ్ధిదారుడికి అసలు బ్యాంకు ఖాతా గానీ, డెబిట్ కార్డు గానీ, మొబైల్ బ్యాంకింగ్ యాప్ గానీ ఉండాల్సిన అవసరమే లేదు. చివరికి స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినా సరే సాధారణ ఫీచర్ ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్ కోడ్‌ను చూపించి సేవలు పొందవచ్చు. దేశంలో నేటికీ బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న కోట్లాది మందిని ఆర్థిక స్రవంతిలోకి తీసుకురావడానికి ఇదొక తిరుగులేని ఆయుధం. ఉదాహరణకు గర్భిణులకు పోషకాహారం కోసమో, క్షయ (టీబీ) రోగులకు మందుల కోసమో, రైతులకు ఎరువుల రాయితీ కోసమో ప్రభుత్వం డబ్బులు ఇస్తే.. ఆ నిధులు మధ్యం తాగడానికో, ఇతర కుటుంబ ఖర్చులకో మళ్లిపోయే ప్రమాదం గతంలో ఉండేది. కానీ ఈ-రూపీ వోచర్‌ను మాత్రం ప్రభుత్వం అనుమతించిన ఆసుపత్రిలో, మందుల దుకాణంలో లేదా ఎరువుల కేంద్రంలో మాత్రమే వాడుకోవాల్సి ఉంటుంది. అక్కడ లబ్ధిదారుడు తన ఫోన్‌లోని కోడ్ చూపించగానే నిర్వాహకులు దాన్ని స్కాన్ చేసి, ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకుని నిర్దేశిత వస్తువు లేదా సేవను అందిస్తారు.

విస్తృత ప్రయోజనాలు.. స్పష్టమైన తేడా..

ఈ విధానం కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాదు. ఆరోగ్యం, విద్య, పోషకాహారం, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి లాంటి ఎన్నో రంగాల్లో దీన్ని అద్భుతంగా వినియోగించుకోవచ్చు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఉపకార వేతనాల పంపిణీలో అక్రమాలకు తావుండదు. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు కూడా తమ ఉద్యోగుల ఆహార, ఆరోగ్య భత్యాల కోసం, సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కింద పేదలకు సాయం చేసేందుకు ఈ వోచర్లను కొనుగోలు చేసి ఇవ్వవచ్చు. మరోవైపు చాలా మంది ఈ-రూపీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసే డిజిటల్ రూపాయితో (సీబీడీసీ) కలిపి చూస్తుంటారు. కానీ ఈ రెండింటికీ స్పష్టమైన తేడా ఉంది. ఆర్‌బీఐ ఇచ్చే డిజిటల్ రూపాయి అనేది మన జేబులో ఉండే కరెన్సీ నోటుకు ప్రత్యామ్నాయమైన చట్టబద్ధమైన డిజిటల్ కరెన్సీ. దాన్ని ఎక్కడైనా, ఏ అవసరానికైనా వాడుకోవచ్చు. కానీ ఈ-రూపీ అనేది కేవలం ఏ వ్యక్తికైతే జారీ చేశారో ఆ వ్యక్తి మాత్రమే, ఏ పని కోసమైతే ఇచ్చారో ఆ పనికి మాత్రమే వాడుకునే ఒక డిజిటల్ కూపన్.

సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు..

ఆశయం ఎంత గొప్పదైనా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించినప్పుడే ఏ సాంకేతికతకైనా సార్థకత చేకూరుతుంది. కేవలం డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినంత మాత్రాన సరిపోదు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈ వోచర్లను స్వీకరించే వ్యాపార, సేవా కేంద్రాల నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాలి. నిరక్షరాస్యులు, వృద్ధులు తమ ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ కోడ్‌ను, ఓటీపీని సైబర్ నేరగాళ్ల చేతిలో పెట్టకుండా ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలి. ఫోన్ పోయినా, మెసేజ్ డిలీట్ అయినా తిరిగి ఆ వోచర్‌ను పొందేలా గ్రామ స్థాయిలో సులభతరమైన ప్రత్యామ్నాయ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అలాగే కోట్లాది మంది లబ్ధిదారుల వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం కలగకుండా పటిష్టమైన సైబర్ భద్రతా కవచాన్ని నిర్మించాలి. ప్రభుత్వం ఇచ్చే ప్రతి పైసా సరైన వ్యక్తికి, సరైన సమయంలో, సరైన ప్రయోజనం కోసం చేరాలన్న లక్ష్యాన్ని ఈ-రూపీ నిజం చేయగలదు. సాంకేతికతకు పారదర్శకమైన నియంత్రణ, ప్రజల్లో చైతన్యం తోడైతే భారత సంక్షేమ పంపిణీ చరిత్రలో ఈ-రూపీ ఒక సువర్ణాధ్యాయంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మహిళా కోటాపై కేంద్రం పట్టు

- **మరోసారి డీలిమిటేషన్ బిల్లు!**
- **రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు**
- **ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ**
- **మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తామన్న ధీమా**
- **అవసరమైన మెజారిటీ కంటే 15-18 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా**
- **లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచే ప్రతిపాదన**
- **2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లే లక్ష్యం**
- **దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారంపైనా దృష్టి**



న్యూఢిల్లీ, నవంబర్ 13 (చురకలు): పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కీలక రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు త్వరలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా కోటాను అమలులోకి తీసుకురావాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలంటే లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ, అంటే కనీసం 361 మంది సభ్యుల మద్దతు తప్పనిసరి. ఇందుకోసం తెరవెనుక విపక్షాలు, ఇతర పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి బిల్లు ఆమోదానికి అవసరమైన 361 ఓట్ల కన్నా అదనంగా మరో 15 నుంచి 18 ఓట్లు తమకు లభిస్తాయని ఎన్డీయే వర్గాలు పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల ప్రత్యేక భేటీలో భాగంగా మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఆ సమయంలో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో మూడింట రెండొంతుల మెజారిటీ లభించక ఆ బిల్లు వీగిపోయింది. మరోవైపు, ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ (ముగింపు) చేయలేదు. దీనివల్ల ఎప్పుడైనా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారానికి ప్రణాళిక: డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలను ఏకంగా 850కి పెంచాలని కేంద్రం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోతుందంటూ దక్షిణాది నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం పలు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాలను 50 శాతం మేర పెంచడం లేదా రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే యథాతథంగా కొనసాగించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. అయితే, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల తేదీలపై ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

అస్సాంలో మృత్యుఘోష

ట్రక్కు-మినీ బస్సు ఢీకొని 23 మంది దుర్మరణం! ■ కాజిరంగ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

గువాహటి/కాజిరంగ, నవంబర్ 13 (చురకలు): అస్సాంలోని కాజిరంగ జాతీయ ఉద్యానవనం సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి-715పై రొంగాజన్ (హతికులి టీ ఎస్టేట్) ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు (ట్రావెలర్), ఎదురుగా వస్తున్న భారీ కంటైనర్ ట్రక్కు అత్యంత వేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ పెను విషాదంలో 23 మంది ప్రయాణికులు దుర్మరణం పాలవగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, మరణించిన వారిలో ఎక్కువ మంది కళాశాల విద్యార్థులే ఉన్నట్లు తెలుస్తోంది. గోలాఘాట్ జిల్లాలోని బొకాఖాట్ నుంచి పొరుగు జిల్లా అయిన నగావ్ వైపు వెళ్తున్న మినీ బస్సును, తేజ్‌పూర్ నుంచి దిబ్రూగఢ్ వైపు వెళ్తున్న కంటైనర్ ట్రక్కు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. బస్సు శిథిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీస్తున్నామని, 23 మంది మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని గోలాఘాట్ సీనియర్ ఎస్పీ స్వప్ననీల్ దేకా వెల్లడించారు. గాయపడిన వారిని తొలుత కోహోరా మోడల్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి జోర్హాట్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి తరలించారు. కాజిరంగ నేషనల్ పార్క్ సమీపంలో వాహన వేగంపై ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ మినీ బస్సు అతివేగంతో ప్రయాణించిందని, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదానికి గురైన ఈ వాహనంపై గతంలోనే ఓవర్‌స్పీడింగ్‌కు సంబంధించి పలు చలాన్లు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ ఘోర దుర్ఘటనపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ సర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అతుల్ బోరా స్వయంగా ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండే అవకాశం ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఒక నగ్న ఫొటోకు.. ఓ యుద్ధ ప్లాన్ లీక్..

- **పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం!**
- **పాక్ యువతి వలపు వలలో చిక్కుకుని దేశ రహస్యాలను తాకట్టు పెట్టిన వింగ్ కమాండర్**
- **రహస్య డ్రోన్ యూనిట్లు, యుద్ధ విమానాల మోహరింపు సమాచారాన్ని లీక్ చేసిన వైనం**
- **సబ్‌ఆర్డినేట్‌ల ఫోన్లలోనూ మాల్‌వేర్ యాప్ ఇన్‌స్టాల్ చేయించిన నిందితుడు**
- **కోర్టులో దిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే వాస్తవాలు వెల్లడి**



న్యూఢిల్లీ, నవంబర్ 13 (చురకలు): పాకిస్థాన్ గూఢచారి వలపు వలలో (హనీ ట్రాప్) చిక్కుకున్న భారత వాయుసేన (ఐఏఎఫ్) అధికారి ఒకరు అత్యంత కీలకమైన దేశ రక్షణ రహస్యాలను శత్రువుల చేతికి అందజేశారు. కేవలం ఆ యువతి పంపే నగ్న చిత్రాల కోసం దేశ భద్రతకు సంబంధించిన యుద్ధ ప్రణాళికలు, సైనిక మోహరింపు సమాచారాన్ని బేరం పెట్టిన సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. కొన్ని నెలల క్రితం అరెస్టయిన ఈ అధికారిపై దిల్లీ పోలీసులు తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి.

వాట్సప్‌లో వేలాది సందేశాలు.. రహస్యాల లీక్:

భారత వాయుసేనలో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్న నిందితుడికి ఆన్‌లైన్ వేదికగా సదరు పాక్ గూఢచారితో పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది జనవరి 12 నుంచి ఏప్రిల్ 1 మధ్య వీరిద్దరూ వాట్సప్‌లో నిరంతరం సంభాషణలు సాగించారు. ఈ క్రమంలో దాదాపు 3,000లకు పైగా టెక్స్ట్ సందేశాలు, 65 ఫొటోలు పంపించుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా వీరి మధ్య 42 వాయిస్ కాల్స్, నాలుగు వీడియో కాల్స్ జరగగా, ఆరు యూఆర్ఎల్స్‌ను కూడా పరస్పరం షేర్ చేసుకున్నారు. భారత్ వద్ద ఉన్న డ్రోన్ సామర్థ్యాలు, సీక్రెట్ డ్రోన్ యూనిట్, సైనిక స్థావరాల వివరాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ ముందుగా మోహరించే యుద్ధ విమానాల వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని సదరు అధికారి పాక్ గూఢచారికి చేరవేశారు.

ఒక్కో నగ్న ఫొటోకు.. ఒక్కో వార్ ప్లాన్ పేజీ:

ఈ వ్యవహారంలో అధికారి వ్యవహరించిన తీరు దర్యాప్తు అధికారులనే విస్మయానికి గురిచేసింది. ఆ గూఢచారి తన నగ్న చిత్రాన్ని పంపిన ప్రతిసారీ, నిందితుడు మన సీక్రెట్ వార్ ప్లాన్‌కు సంబంధించిన ఒక్కో పేజీని ఆమెకు షేర్ చేసినట్లు పోలీసులు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఆమె పంపే ప్రతి నగ్న ఫొటోకు బదులుగా యుద్ధ ప్రణాళికకు సంబంధించిన కొత్త పేజీని పంపిస్తానని అతడు ఆఫర్ ఇచ్చినట్లు తేలింది. వీటితో పాటు లేహ్‌లోని యుద్ధ విమానాల మోహరింపు, సూరత్‌గఢ్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద జరిగే మిలిటరీ విన్యాసాల వివరాలను కూడా లీక్ చేశాడు. అంతేకాకుండా, పాక్ గూఢచారి పంపిన ఒక ప్రమాదకరమైన మాల్‌వేర్ యాప్‌ను తన కింద పనిచేసే సబ్‌ఆర్డినేట్ సిబ్బంది డివైజ్‌లలోనూ ఇన్‌స్టాల్ చేయించినట్లు దర్యాప్తులో బయటపడింది.

స్మార్ట్‌ఫోన్‌తో దొరికిపోయిన వైనం:

ఈ అధికారి దేశద్రోహ చర్యలు మే నెలలోనే వెలుగులోకి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓసారి కార్యాలయంలోకి స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చిన అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. తనిఖీల్లో అనుమానాస్పద అంశాలు గుర్తించిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు వెంటనే సదరు వింగ్ కమాండర్‌పై ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన దిల్లీ పోలీసులు మే 30న అతడిని అరెస్టు చేసి తీహాడ్ జైలుకు తరలించారు. లోతైన దర్యాప్తు అనంతరం తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలి

రైతులకు పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి



దుబ్బాక ప్రతినిధి (అక్బర్ పేట-భూంపల్లి), నవంబర్ 13, :
రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతే గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, మోతే సర్పంచ్ మడ్డి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజలింగారెడ్డి మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం మోతే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూకం, టోకెన్ల జారీ, ధాన్యం విక్రయాల అనంతరం చెల్లింపుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవి, సీఈవో రాజు గ్రామపంచాయతీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపి వివేకానంద

- కొంపల్లిలో ప్రత్యేక పూజలు.. హిల్ కౌంటీలో పడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ పాల్గొన్నారు. కొంపల్లి సర్కిల్ పరిధిలోని కొంపల్లిలో ఉన్న శ్రీశ్రీశ్రీ హరహరసుత అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరిపై అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని హిల్ కౌంటీలో కోలన్ నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కులు సమర్పించారు.

అంబిటస్ పాఠశాలలో అంబరాన్నంటిన బాలల దినోత్సవ సంబరాలు

- సంప్రదాయ, సాంస్కృతిక వేషధారణలో అలరించిన చిన్నారులు.. ఆకట్టుకున్న ఫ్యాషన్ షో..

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :
సిద్దిపేటలోని అంబిటస్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ముందస్తుగా శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నవంబర్ 14న జరుపుకునే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య సందడిగా సాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ, సాంస్కృతిక దుస్తులు ధరించి నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల వస్త్రధారణతో చిన్నారులు వేదికపై హుషారుగా నడుస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. వారి అందమైన వేషధారణ, చలాకీతనం, ఆత్మవిశ్వాసం అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల కేరింతలు, ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎడ్ల జ్యోతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



నూతన పెన్షన్లతో ఆర్థిక భరోసా

- అశ్వారావుపేట నియోజకవర్గంలో 4,900 మందికి కొత్త పెన్షన్లు మంజూరు
- దమ్మపేట మండలంలో 907 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ



దమ్మపేట, నవంబర్ 13, :
అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నూతన పెన్షన్లను మంజూరు చేసిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నూతన పెన్షన్ల మంజూరులో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గానికి 4,900 పెన్షన్లు మంజూరు కాగా, దమ్మపేట మండల పరిధిలో 907 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని దమ్మపేట మండలం, మందలపల్లి గ్రామంలో గల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌లో శుక్రవారం నిర్వహించిన సభలో తెలిపి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ నెల 19వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ కానుందని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోందని పేర్కొన్నారు. ప్రతినెలా అందే పెన్షన్ సొమ్ము నిరుపేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క (అనసూయ)లకు నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దిశెట్టి జ్యోతి, జిల్లా దిశా కమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, దమ్మపేట తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వంకా జానకిరామ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఈ నెల 19న సీఎం సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలి
- ఐకేపీ మహిళా సంఘాల వీఓ లీడర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :
రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో శుక్రవారం నిర్వహించిన మహిళా సంఘాల వీఓ లీడర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చిన్నకోడూరు మండలం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి సంకల్పించిన కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంలో ప్రతి మహిళ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్‌ను వీఓ లీడర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీలు కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, వైకుంఠం, రాజు కుమార్, సీఏలు, వీఓ సంఘాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సదర్ మహోత్సవం..

- ప్రముఖులకు ఆహ్వాన పత్రికల అందజేత
- యాదవుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సదర్ మహోత్సవం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, :
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న 17వ వార్షిక సదర్ సమ్మేళన మహోత్సవానికి హాజరుకావాలని పలువురు ప్రముఖులను సదర్ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. సదర్ కమిటీ చైర్మన్, అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జే.కే. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, బాలానగర్ ఏసీపీ గంగిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డిని కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. సదర్ సమ్మేళన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహోత్సవ నిర్వహణకు కమిటీ చేపడుతున్న ఏర్పాట్లను ప్రముఖులకు వివరించారు. యాదవుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలు, వీరత్వం, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా సదర్ సమ్మేళనాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. యాదవ సోదరులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సదర్ కమిటీ సభ్యులు ఆర్థిక్ యాదవ్, సింహం యాదవ్, గండి రాజు యాదవ్, బాలు యాదవ్, శ్రీకాంత్ యాదవ్, గొల్ల పాండు యాదవ్, కుర్మయ్య యాదవ్, మోటే కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలి యాదవ్‌కు కొలన్ హన్మంత్ రెడ్డి శుభాకాంక్షలు

- రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు చేపట్టిన అంజలి యాదవ్‌కు అభినందనలు..
- మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచన



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన గంగుల అంజలి యాదవ్ శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి అంజలి యాదవ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేయాలని, పార్టీ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో గంగుల అంజలి యాదవ్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించనున్న సదర్ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను కొలన్ హన్మంత్ రెడ్డి తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవ రెడ్డితో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి భరోసా.. సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద చొరవతో 8 మంది లబ్ధిదారులకు ఆర్థిక చేయూత



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం పొందలేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు 286, 287 డివిజన్ల పరిధిలోని ఎనిమిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) మంజూరైన చెక్కులను చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకులు కుంట సిద్దిరాములు, గందం సుధాకర్ గౌడ్, సంపత్ గౌడ్, వీరారెడ్డి నరేందర్ రెడ్డి, అరుణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, కాలే గణేష్, సమ్మెట ఎల్లగౌడ్, బలరాం, డీజే రమేష్, రాజు యాదవ్ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. నిరుపేదలకు అండగా నిలుస్తూ, వారి ఆరోగ్య సంరక్షణకు తోడ్పడుతున్న ఎమ్మెల్యే సేవలు అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

దుండిగల్ సర్కిల్‌లో పడకేసిన వైద్య ఆరోగ్య సేవలు!

- 20 రోజులుగా చిన్నారులకు నిలిచిన టీకాలు.. 120 మంది సిబ్బందిలో నలుగురే పర్మినెంట్!
- పల్స్ పోలియో కార్యక్రమంపైనా నీలినీడలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం





కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : దుండిగల్ సర్కిల్ పరిధిలో వైద్య ఆరోగ్య సేవలు తీవ్రంగా కుంటుపడ్డాయి. సిబ్బంది కొరత, ఉద్యోగుల ఆందోళనలతో ప్రభుత్వ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నారులకు అందించాల్సిన టీకాల కార్యక్రమం గత 20 రోజులుగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితిపై భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండిగల్ సర్కిల్ పరిధిలో గతంలో పది మంది పర్మినెంట్ ఏఎన్ఎంలు విధులు నిర్వహించేవారని, వారందరినీ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఇతర రూరల్ ప్రాంతాలకు బదిలీ చేయడంతో స్థానికంగా శాశ్వత సిబ్బంది కొరత ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలో సుమారు 120 మంది ఆరోగ్య సిబ్బంది పనిచేస్తుండగా, వారిలో కేవలం నలుగురు మాత్రమే పర్మినెంట్ ఉద్యోగులు ఉండటం వైద్య ఆరోగ్య శాఖ దుస్థితికి అద్దం పడుతోందన్నారు. మిగిలిన వారిలో అధిక శాతం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆయాలు ఉన్నారని పేర్కొన్నారు. బదిలీ చేసిన ఉద్యోగుల స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడం వల్ల వైద్య సేవల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. మరోవైపు కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆయాలు వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ తదితర న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల పలు పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు ఆటంకం ఏర్పడుతోందని అన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

సిబ్బంది కొరత, ఉద్యోగుల ఆందోళనల ప్రభావం చిన్నారుల ఆరోగ్యంపై పడుతోందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా పలు పీహెచ్‌సీల్లో నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు వేయాల్సిన టీకాలు అందడం లేదని, పిల్లలకు టీకాలు వేయించేందుకు ఆసుపత్రులకు వెళ్తున్న తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన టీకాల కార్యక్రమం నిలిచిపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతేనని, అదే సమయంలో ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

పల్స్ పోలియో కార్యక్రమంపైనా ఆందోళన

ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపైనా ప్రస్తుత పరిస్థితులు ప్రభావం చూపే అవకాశం ఉందని నర్సారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు పీహెచ్‌సీల్లో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని, ఆరోగ్య సిబ్బంది ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించకుండా పల్స్ పోలియో కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఎలా విజయవంతంగా నిర్వహిస్తారని ప్రశ్నించారు. చిన్నారులకు పోలియో చుక్కలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దుండిగల్ సర్కిల్ పరిధిలో అవసరమైన పర్మినెంట్ వైద్య ఆరోగ్య సిబ్బందిని వెంటనే నియమించాలని, సిబ్బంది కొరతను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందితో ఉన్నతాధికారులు చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అప్పటివరకు ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేసి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగించాలని, టీకాలు అందక ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు ప్రత్యేక వైద్య బృందాల ద్వారా వెంటనే టీకాలు వేయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన సిబ్బందిని ముందుగానే సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రచార ఆర్భాటాలకంటే ప్రజల ఆరోగ్యం, చిన్నారుల భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, దుండిగల్ సర్కిల్‌లో వైద్య ఆరోగ్య సేవలను గాడిలో పెట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.

బస్తీ దవాఖానపై మరో రెండు అంతస్తులు నిర్మించాలి

- ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుడు పరిష వేణు వినతి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : రంగారెడ్డినగర్‌లోని బస్తీ దవాఖాన భవనంపై ఎంపీ నిధులతో మరో రెండు అంతస్తులు నిర్మించి, బస్తీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మాజీ డివిజన్ అధ్యక్షులు పరిష వేణు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీ నివాస కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరిష వేణు మాట్లాడుతూ.. రంగారెడ్డినగర్ బస్తీ ఏర్పడినప్పటి నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం ఎలాంటి స్థలాన్ని కేటాయించలేదన్నారు. దీంతో సుమారు 20 ఏళ్ల క్రితం బస్తీ పెద్దలంతా కలిసి కమ్యూనిటీ హాల్ కోసం 100 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. ఆ స్థలంలో బస్తీకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించేవారని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సదరు స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్తీ దవాఖాన, మొదటి అంతస్తులో లైబ్రరీ, రెండో అంతస్తులో పిల్లల క్రీడలకు సంబంధించిన హాల్ నిర్మించి బస్తీ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే బస్తీ దవాఖాన నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని, మిగిలిన రెండు అంతస్తుల నిర్మాణాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల తెలంగాణ ప్రభుత్వ పాలనలోనూ అదనపు నిర్మాణాలు చేపట్టలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. ఈ సమస్యపై పలుమార్లు చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినా, నిధుల కొరత కారణంగా అధికారులు స్పందించడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా తన ఎంపీ



నిధులతో అదనపు అంతస్తుల నిర్మాణానికి కృషి చేసి బస్తీ ప్రజలకు ఉపయోగపడేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు పరిష వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు లావణ్య, చంద్రప్రకాష్, ముదిరాజ్, లక్షి , శివకుమార్ ముదిరాజ్, గోపాల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానపై మరో రెండు అంతస్తులు నిర్మించాలి

- ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుడు పరిష వేణు వినతి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : రంగారెడ్డినగర్‌లోని బస్తీ దవాఖాన భవనంపై ఎంపీ నిధులతో మరో రెండు అంతస్తులు నిర్మించి, బస్తీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మాజీ డివిజన్ అధ్యక్షులు పరిష వేణు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీ నివాస కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరిష వేణు మాట్లాడుతూ.. రంగారెడ్డినగర్ బస్తీ ఏర్పడినప్పటి నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం ఎలాంటి స్థలాన్ని కేటాయించలేదన్నారు. దీంతో సుమారు 20 ఏళ్ల క్రితం బస్తీ పెద్దలంతా కలిసి కమ్యూనిటీ హాల్ కోసం 100 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. ఆ స్థలంలో బస్తీకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించేవారని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సదరు స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్తీ దవాఖాన, మొదటి అంతస్తులో లైబ్రరీ, రెండో అంతస్తులో పిల్లల క్రీడలకు సంబంధించిన హాల్ నిర్మించి బస్తీ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే బస్తీ దవాఖాన నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని, మిగిలిన రెండు అంతస్తుల నిర్మాణాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల తెలంగాణ ప్రభుత్వ పాలనలోనూ అదనపు నిర్మాణాలు చేపట్టలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. ఈ సమస్యపై పలుమార్లు చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినా, నిధుల కొరత కారణంగా అధికారులు స్పందించడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా తన ఎంపీ నిధులతో అదనపు అంతస్తుల నిర్మాణానికి కృషి చేసి బస్తీ ప్రజలకు ఉపయోగపడేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు పరిష వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు లావణ్య, చంద్రప్రకాష్, ముదిరాజ్, లక్షి , శివకుమార్ ముదిరాజ్, గోపాల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



పేద కుటుంబాలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక భరోసా – ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్‌లో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గౌడ్ కార్యాలయంలో శుక్రవారం సాయిబాబా నగర్ డివిజన్ పరిధికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే తమ లక్ష్యమని, భవిష్యత్తులోనూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్ రెడ్డి, వారాల వినోద్ కుమార్, పోలే శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, దుర్గా, కావలి రవి తదితరులు పాల్గొన్నారు.

నీరు, విద్యుత్ ను పొదుపుగా వాడండి.. వృధాను అరికట్టండి..

దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఎ మహేష్ కుమార్



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 13, :
ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వార్డుల్లో నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని, వృధాను అరికట్టాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఎ మహేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దుబ్బాక మున్సిపాలిటీలోని చెల్లాపూర్ పరిధిలో గల రెండు, మూడు వార్డుల్లో పురపాలిక ఆధ్వర్యంలో ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో కలిగే ఇబ్బందులు, ముందస్తు జాగ్రత్తలు, నీటి, విద్యుత్ వృధా వంటి పలు అంశాలపై ఆయా వార్డుల కౌన్సిలర్లు కనకరాజు, ఎల్లవ్వ తో కలిసి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలుచోట్ల వృధాగా పోతున్న మిషన్ భగీరథ నల్లాల వద్ద అప్పటికప్పుడు డమ్మీలను ఏర్పాటు చేసి, నీటి వృధాను అరికట్టారు. వార్డుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్ల వద్ద నీటి లీకేజీలను అరికట్టాలని, నీటిని వృధా చేస్తే రానున్న రోజుల్లో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా, తడి, పొడి చెత్త రూపంలో వేరుచేసి, పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. త్వరలోనే వార్డుల్లో అవసరమున్న చోట్ల డ్రైనేజీలు కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది దిలీప్, అనిల్, రాజశేఖర్, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌ను సందర్శించిన సిద్ధిపేట జిల్లా విద్యార్థులు

- గ్రామీణ విద్యార్థులకు అరుదైన అవకాశం కల్పించిన ఎంపీ రఘునందన్ రావు



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :
సిద్ధిపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దేశ పార్లమెంటును ప్రత్యక్షంగా సందర్శించే అరుదైన అవకాశాన్ని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కల్పించారు. పార్లమెంట్ స్టడీ విజిట్‌లో భాగంగా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం పార్లమెంటును సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు విద్యార్థులను వెంటబెట్టుకొని పార్లమెంట్ ప్రాంగణాన్ని చూపించడంతో పాటు, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించారు. పార్లమెంటరీ విధానాలు, చట్టసభల నిర్వహణ, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, చట్టాల రూపకల్పనలో పార్లమెంట్ పాత్ర, ప్రజాస్వామ్య విలువల గురించి తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభించింది. పుస్తకాల ద్వారా నేర్చుకున్న పార్లమెంటరీ వ్యవస్థను ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవడం విద్యార్థుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. దేశ అత్యున్నత చట్టసభను సందర్శించడం తమకు మరచిపోలేని అనుభూతినిచ్చిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి విద్యా పర్యటనలు ఎంతో ఉపయోగకరమని, భవిష్యత్తులో ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

చందనోత్సవం మహాసంప్రోక్షణ కార్యక్రమానికి స్పీకర్‌కు ఆహ్వానం



హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 13, :
కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుండి 20 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ స్వామివారి చందనోత్సవం మహాసంప్రోక్షణ కార్యక్రమానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందవలసిందిగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను వికారాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఆలయ అధికారులు శుక్రవారం కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఉత్సవాల ప్రత్యేక ఆహ్వాన పత్రికను స్పీకర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అంజనా రెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ కుమార్, వేద పండితులు రాజేశ్వర శర్మ, ఉప ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణే ధ్యేయం

- భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 13:

జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో మురుగునీరు కలవకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, చెరువు పరిరక్షణ, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం అమృత్ 2.0 పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి చింతకుంట చెరువు, గ్రేవ్‌యార్డ్ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు ముఖ్యమంత్రి చొరవతో అమృత్ 2.0 పథకం కింద జగిత్యాల పట్టణంలోని మోతె చెరువు, చింతకుంట చెరువు, రాయికల్ పెద్ద చెరువు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, చెరువుల సహజ స్వరూపాన్ని కాపాడుతూ భావితరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో మున్సిపాలిటీలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న సీనియర్ నాయకులు, వారి కుటుంబ సభ్యులు పట్టణ అభివృద్ధి, చెరువుల పరిరక్షణపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీలపై నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలు, చెరువుల బఫర్ జోన్ పరిధిలో ఇళ్లు, వ్యాపారాలు ఏర్పడ్డాయని, వీటి ప్రభావంతో నేడు చెరువులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని అన్నారు. గతంలో జరిగిన అక్రమ నిర్మాణాలపై సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. హైడ్రా తరహాలో జగిత్యాలలో కూడా చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని గతంలో ఆ పెద్దమనిషి సూచించారని గుర్తుచేస్తూ, చెరువుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, లే అవుట్ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టేలా చూడాలని సూచించారు. ఈ విషయంలో ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. చెరువుల పరిరక్షణ అనేది కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, భూగర్భ జలాల పెంపునకు, పర్యావరణ సమతుల్యతకు, గంగపుత్రుల జీవనోపాధికి ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, ఈఈ ఖాన్, డీఈ వరుణ్, ఎమ్మార్వో రామ్మోహన్, టీపీఓ శ్రీనివాస్, కౌన్సిలర్లు బొల్లారపు స్వప్న, రజియొద్దీన్, అయూబ్ ఖాన్, బదుగు పద్మ రాజేందర్, దుమాల రాజ్ కుమార్, కూతురు రాజేష్, పిట్ట ధర్మరాజు, జంబర్తి గంగలక్ష్మి రాజ్ కుమార్ తదితర కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులు, వార్డు నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.. న్యుమోనియా లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు..

- దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి
- తల్లిపాలు, పరిశుభ్రత, టీకాలతో న్యుమోనియాను నివారించవచ్చు
- సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ టీసీ మనోహర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :

చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, న్యుమోనియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ, చిన్నపిల్లల విభాగ వైద్యులు డాక్టర్ టీసీ మనోహర్ సూచించారు. వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే చిన్నారులను ప్రమాదం నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో న్యుమోనియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ టీసీ మనోహర్ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో దగ్గు, జ్వరం, వేగంగా లేదా కష్టంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. న్యుమోనియా నివారణలో తల్లిపాలు, వ్యక్తిగత పరిశుభ్రత, సకాలంలో టీకాలు వేయించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పుట్టిన శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం న్యుమోకోకల్, పెంటావాలెంట్ తదితర టీకాలను తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. చిన్నారుల వద్దకు వెళ్లే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా చలికాలంలో పిల్లలను వెచ్చగా ఉంచడంతో పాటు చల్లని గాలి, దుమ్ము, పొగకు దూరంగా ఉంచాలని తెలిపారు. పిల్లల్లో కనిపించే దగ్గు, జ్వరం వంటి లక్షణాలను సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ నెల 12వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు న్యుమోనియా నివారణ, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



నిర్లక్ష్యం వద్దు.. అప్రమత్తతే రక్షణ..

'దగ్గును నిర్లక్ష్యం చేయకండి.. చిన్నారుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టకండి'.. అనే సందేశంతో ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ఆసుపత్రి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ రాగిణి, డాక్టర్ రమ్య, డాక్టర్ రవి, డాక్టర్ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మన్‌గా కాచం కైలాసం గుప్తా

- ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం.. నూతన చైర్మన్‌కు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అభినందనలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ నూతన చైర్మన్‌గా కాచం కైలాసం గుప్తా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవాలయ హాలులో దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ రేగూరి ప్రవీణ్ గుప్తా అధ్వర్యంలో ఘనంగా సన్మాన సభ, ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, టీపీసీసీ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై నూతన చైర్మన్ కాచం కైలాసం గుప్తాను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ అభివృద్ధికి నూతన చైర్మన్ ప్రత్యేక చొరవ చూపాలని ఆకాంక్షించారు. దేవాలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు, పలువురు వైశ్య సంఘం ప్రముఖులు కాచం కైలాసం గుప్తా దంపతులను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ నేతి శంకర్ గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి లక్ష్మణరావు గుప్తా, కార్యనిర్వాహక అధ్యక్షులు యాద నరేంద్ర గుప్తా, అదనపు సంయుక్త కార్యదర్శి అంగడి సత్యనారాయణ గుప్తా, కోశాధికారి నర్సింలు గుప్తా, ఉపాధ్యక్షులు లక్షి నర్సయ్య గుప్తా, కార్యదర్శి గజ్జి ఉపేందర్ గుప్తా, దామెర జగదీశ్ గుప్తా, గంజి స్వామి తదితరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- రాజీవ్ గాంధీ నగర్‌లో రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : మౌలిక వసతుల కల్పనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం 129వ సూరారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో రూ.68 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు సీసీ రోడ్లకు, రూ.35.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత 12 ఏళ్లుగా కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అజయ్ కుమార్ కుంచాల, చైర్మన్ అశోక్, సలహాదారులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సిద్ధప్ప, కోశాధికారి పాశం సంపత్ రెడ్డి, ఉపాధ్యక్షులు తాటి విక్రమ్, సంపంగి సతీష్, సభ్యులు నవీన్, వెంకట్, మోబిన్, అవినాష్, శ్రవణ్, గణపతి, ప్రశాంత్, వెంకట్ రావు, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, సీనియర్ నాయకులు కొండకళ్ళ శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీను, కోల శ్రీకాంత్ ముదిరాజ్, ఇతర నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



మురసు తుఫాన్ నష్టాల మరమ్మతులకు రూ.13 లక్షల నిధులు



- ప్రమాదంలో చెయ్యి కోల్పోయిన వ్యక్తికి రూ.4.50 లక్షల ఎల్ఓసీతో రోబోటిక్ చేయి అమరిక
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట, నవంబర్ 13, :

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. దమ్మపేట మండలం తొట్టిపంపు గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ ప్రాంతాల్లో మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం ద్వారా రూ.13 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.అనంతరం అదే పంచాయతీ పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీని పరామర్శించారు. 15 సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తన కుడి చేతిని కోల్పోయారు. రఫీ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సహాయం అందించేందుకు రూ.4.50 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ సహాయంతో ఏర్పాటు చేసిన రోబోటిక్ చేతిని ఎమ్మెల్యే స్వయంగా రఫీకి అమర్చించి, ఆయనకు భరోసా కల్పించారు. ప్రజల కష్టాలను గుర్తించి, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పొదిలి జ్యోతి, స్థానిక సర్పంచ్ సోయం లక్ష్మీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగు ప్రణాళిక, విద్య, భూసేకరణపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :

రాబోయే రబీ సీజన్‌కు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపు, జాతీయ రహదారుల భూసేకరణ పనుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రబీ సాగుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు వ్యవసాయ, ఉద్యానవన, సూక్ష్మ సేద్య శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని, కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాయితీ విత్తనాల పంపిణీ, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్య పరికరాల వినియోగంపై రైతులకు వివరించాలని సూచించారు.

విద్యార్థుల హాజరు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాన కార్యదర్శి తెలిపారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థుల హాజరు 73.74 శాతం ఉండగా, సిద్దిపేట జిల్లాలో 72.21 శాతంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల హాజరు రాష్ట్రస్థాయిలో 87.06 శాతం, జిల్లాలో 88.05 శాతంగా నమోదైందని వివరించారు. ఉపాధ్యాయుల హాజరుకు అనుగుణంగా విద్యార్థుల హాజరు కూడా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేందుకు డిజిటల్ విద్యా వేదికలను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి హాజరు, విద్యాబోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించాలని ఆదేశించారు. సమగ్ర శిక్షా పథకం కింద చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 96 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 11,520 సీట్లకు గాను 7,107 ప్రవేశాలు నమోదయ్యాయని, 61.69 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని తెలిపారు. మిగిలిన సీట్ల భర్తీపై దృష్టి సారించాలని, కళాశాలల్లో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.



వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు జంతు జనన నియంత్రణ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీల ద్వారా ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రోడ్లు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పరిధిలో చేపడుతున్న భూసేకరణ పనుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణలో అవార్డుల జారీ, పరిహారం పంపిణీ, భూముల స్వాధీనం మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించాలని తెలిపారు. అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన భూయజమానులకు పరిహారం సకాలంలో అందించాలని, నిర్దిష్ట లక్ష్యాల మేరకు భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రబీ సాగులో తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు రాయితీ విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కూడా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎఫ్ఓ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రమేష్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, డీఎంహెచ్ఓ ధనరాజ్, డివీఈహెచ్ఓ, డీఐఓతో పాటు వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూసాపేట ట్రక్ పార్క్ భూముల విక్రయాలను సహించేది లేదు!

- ప్రజా అవసరాలకు కేటాయించిన భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారు?
- వేలం ప్రక్రియ నిలిపివేయకపోతే సీపీఐ, సీపీఎంలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతాం: మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 13, : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట ట్రక్ పార్క్ భూములను వేలం వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ట్రక్ పార్క్ వద్ద భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబిపూర్ రాజు హాజరై ప్రభుత్వ భూముల విక్రయాల ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిరసనలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, సీపీఐ, సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. మూసాపేట ట్రక్ పార్క్‌కు సంబంధించిన భూములను ప్రజా అవసరాల కోసమే వినియోగించాలని, వాణిజ్య అవసరాలకు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి లేదా ఇతర వ్యాపార కార్యకలాపాలకు ఉపయోగించకూడదని చట్టంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి నిబంధనలను ఉల్లంఘిస్తూ భూములను విక్రయించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని విమర్శించారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన భూములను అమ్మకానికి పెట్టారని, మిగిలిన భూములను సైతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో తనఖా పెట్టి నిధులు సమీకరించి ఢిల్లీకి పంపాలని చూస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్ర సంపదను విక్రయిస్తూ భవిష్యత్ తరాలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో వివిధ ప్రభుత్వాల హయాంలో పలువురు ముఖ్యమంత్రులు ఈ విలువైన భూములను కాపాడుకుంటూ వచ్చారని గుర్తుచేశారు. అలాంటి భూములను ఇప్పుడు అమ్మకానికి పెట్టడం దురదృష్టకరమన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని హౌసింగ్ బోర్డు స్థలాలు, 200 గజాల స్థలాలు, పార్కులు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బొందలగడ్డ వంటి ప్రాంతాలను కూడా విక్రయించే పరిస్థితి తీసుకొచ్చారని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలో భవిష్యత్తులో జనాభా దాదాపు 25 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని, ఇప్పటికే పెద్ద సంఖ్యలో హైరైజ్ భవనాలు నిర్మితమయ్యాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు పార్కులు, క్రీడా మైదానాలు, పార్కింగ్ స్థలాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ భూములు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న భూములను కూడా విక్రయిస్తే భవిష్యత్ తరాలకు కనీస మౌలిక సదుపాయాలు





కల్పించడానికి స్థలం ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. మూసాపేట ట్రక్ పార్క్ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించడానికి వీల్లేదని, ప్రభుత్వం వెంటనే వేలం ప్రక్రియను నిలిపివేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

ప్రజా ఆస్తులను కాపాడే వరకు పోరాటం ఆగదు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన భూములను విక్రయించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను భవిష్యత్ తరాలకు ఆస్తిగా అందించాల్సిన అవసరం ఉందని, వాటిని వేలం వేసి విక్రయించడం సరికాదన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజల ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, మందాడి శ్రీనివాసరావు, సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దీన్, మహేశ్వరీ శ్రీహరి, వివిధ డివిజన్ల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సీపీఐ నాయకులు సత్యం, కీలుకాని లక్ష్మణ్, సీపీఎం నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేస్తాం
- 172 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- లబ్ధిదారులకు పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్/తిమ్మాపూర్, నవంబర్ 13 : ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 172 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. తిమ్మాపూర్ మండలంలో తొలి విడతలో 643 ఇళ్లు మంజూరు చేయగా, తాజాగా 172 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువులోగా నిర్మాణాలు చేపట్టని పక్షంలో మంజూరును రద్దుచేసి ఇతర అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణ బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మకుండా ప్రజలు వాస్తవాలను గుర్తించి న్యాయనిర్ణేతలుగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ డీఈ శ్రీలత, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మహేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు తిరుపతిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, వివిధ గ్రామాల సర్పంచులు పొన్నాల సంపత్, గంకిడి లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి సంధ్య, గోదారి శోభారాణి, పెరుక రవీందర్, ఎన్. చంద్రారెడ్డి, బిల్ల సంతోష్, దుర్గం శ్రీనివాస్, ఎం. స్వరూప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భూ పరిరక్షణకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

- 1.06 ఎకరాల పాఠశాల స్థలాన్ని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేయాలి: జేఏసీ డిమాండ్
- సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం: డీఈఓ రేణుక దేవి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 13, : ప్రగతినగర్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన భూమిని పరిరక్షించాలనే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 1.06 ఎకరాల స్థలాన్ని కాపాడాలని, ప్రభుత్వం వెంటనే అధికారికంగా నోటిఫై చేసి భూమికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. నవంబర్ 13న మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆల్విన్ చౌరస్తా మీదుగా వాసవి లేఅవుట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలని, భూమిపై వస్తున్న ఆక్రమణ

ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడేం దుకు తమ వంతు బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు, పాఠశాల భూ సమస్యపై స్పందించిన డీఈఓ రేణుక దేవి, ఎంఈఓ రామకృష్ణ పాఠశాలను సందర్శించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భూ సమస్య కారణంగా విద్యార్థులు చదువుపై నిర్లక్ష్యం చూపవద్దని సూచించారు. అయితే, కార్యక్రమం చివరలో డీఈఓ వ్యవహరించిన తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, జేఏసీ నాయకులు అసంతృప్తి, మన స్తాపం వ్యక్తం చేశారు. పాఠశాల స్థల పరిరక్షణ విష యంలో విద్యాశాఖ అధికారులు మరింత బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కోరారు. పాఠశాలకు చెందిన 1.06 ఎకరాల భూమిని ప్రభుత్వం అధికారి కంగా నోటిపై చేసి, పూర్తిస్థాయిలో రక్షణ కల్పించే వరకు తమ పోరాటం ఆగదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రగతినగర్ జేఏసీ నాయకులు ఆకుల సతీష్, నిండా శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకుడు సంతోష్, రమణి మల్యాల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్న య్య, ఉపాధ్యాయ బృందం, వాసవి లేఅవుట్ అసోసి యేషన్, శిల్పా పారడైజ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సిద్దిపేటకు తరలివెళ్లిన గజ్వేల్ నియోజకవర్గ టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



- టీఆర్ఎస్ కొట్టాల యాదగిరి గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్

గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 13, : సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన తొలి జిల్లా కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి గజ్వేల్ నియోజక వర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. శుక్రవారం ఉదయం గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బస్సులు, కార్లలో కొట్టాల యాదగిరి గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆధ్వర్యంలో సిద్దిపేటకు బయలుదేరారు. ముఖ్యంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేనకి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో పార్టీలో భారీగా చేరికలు ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు.

బాలల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- బాలలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలి
- బాలల రక్షణ, విద్య, ప్రేమ అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత
- బాలల దినోత్సవ వేడుకల్లో డీఎల్ఎస్ప కార్యదర్శి సౌజన్య

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, : బాలలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని, చిన్నతనం నుంచే నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. సిద్దిపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సౌజన్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలే దేశ సంపద అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు, ప్రభుత్వ సేవలపై అవగాహన పెంచుకోవాలని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా వాటిని అధిగమించేలా ఆత్మవిశ్వాసం పెంపొందించు కోవాలని సూచించారు. ప్రతి బిడ్డకు రక్షణ, విద్య, ప్రేమ పొందే హక్కు ఉందని తెలిపారు. జువైనల్ జస్టిస్ చట్టం, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టంపై పిల్లలు, తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలలకు ఎలాంటి అన్యాయం జరిగినా 1098 చైల్డ్‌లైన్



లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లాలో శిశు సంరక్షణ కేంద్రాలు, బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సేవలను అభినందించారు. జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ మాట్లాడుతూ చిన్నతనం నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి విద్యతో పాటు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని అన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ మాట్లాడుతూ.. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో షీ టీమ్స్ ద్వారా బాలల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న బాలల పరిరక్షణ సేవలను వివరించారు. గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీల (వీఎల్‌సీపీసీ) బాధ్యతలు, బాలల భద్రతలో వాటి పాత్రను వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, జిల్లా సంక్షేమ అధికారి శారద, బాలల సంక్షేమ సమితి సభ్యులు నరసింహులు, మంజుల, అంజమ్మ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, ఆశ్రిత స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ పర్వతాలు, బాలల పరిరక్షణ అధికారులు, వివిధ శిశు సంరక్షణ కేంద్రాల ప్రతినిధులు, పిల్లలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 13 : జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ మాజీ సర్పంచ్ సిరిగిరి తిరుపతి భాగ్య దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై నూతన గృహంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి భాగ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, సీనియర్ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ కూతురు రాజేష్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- నవంబర్ 19న సిద్దిపేట జిల్లా నుంచి పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క..
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసాతో పాటు జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం విధివిధానాలు, అమలు తీరు, కుటుంబాల నమోదు ప్రక్రియ, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కులమతాలు, ఆదాయ పరిమితులతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఇటువంటి వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పథకం అమలుకు సంబంధించి జిల్లా, మండల, గ్రామస్థాయిలో అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలు, పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను కూడా సర్వే ఆధారంగా పరిశీలించి పథకంలో చేర్చాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమన్వయంతో గ్రామాలు, వార్డులు, డివిజన్లలో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బీమా మొత్తానికి ఒకరిని లేదా ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం కుటుంబాలకు ఉంటుందని వివరించారు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకుంటే బీమా మొత్తాన్ని తమకు నచ్చిన నిష్పత్తిలో పంపిణీ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. దరఖాస్తులోని వివరాలను కుటుంబ సభ్యులకు పూర్తిగా చదివి వినిపించి, వారికి అర్థమయ్యేలా వివరించిన తర్వాతే సంతకాలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. నవంబర్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, పట్టణంలోని కుటుంబాలకు పథకం లక్ష్యాలు, ప్రయోజనాలు, నమోదు విధానం, నామినీల ఎంపికపై అవగాహన కల్పించాలని సూచించారు. నవంబర్ 17, 18 తేదీల్లో నమోదు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

నమోదులో ఖచ్చితత్వం పాటించాలి.. సీఎస్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వారి సమాచారం, నామినీల వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నవంబర్ 19 నుంచి తదుపరి 15 నుంచి 20 రోజుల వ్యవధిలో నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని తెలిపారు. పథకం అమలుపై అధికారులకు ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత శాఖల ద్వారా నివృత్తి చేసుకొని, అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు.

సిద్దిపేట జిల్లా నుంచి సీఎం ప్రారంభం.. కలెక్టర్ హైమావతి

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, జెడ్పీ సీఈఓ రమేష్, మెప్మా పీడీ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాగితాలకే పరిమితమవుతున్న బాలల సంక్షేమం

క్షేత్రస్థాయిలో అందని ఆపన్న హస్తం

- సెల్‌ఫోన్ తెర వెనుక బందీ అవుతున్న బాల్యం ఒకవైపు
- అనాథ పిల్లల అంతుచిక్కని లెక్కలు మరోవైపు



నేటి బాలలే రేపటి పౌరులు అన్న నినాదం బాలల దినోత్సవం వేళ ప్రతి చోటా మార్మోగుతుంటుంది. కానీ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే ఈ నినాదం కేవలం కాగితాలకే పరిమితమవుతోందన్న చేదు నిజం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఒకవైపు మారుతున్న జీవనశైలిలో భాగంగా తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల చిన్నారులు సెల్‌ఫోన్ తెరలకు, జంక్ ఫుడ్‌కు బానిసలై తమ సహజమైన బాల్యాన్ని కోల్పోతుండగా.. మరోవైపు కన్నవారిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న అనాథ బాలల జీవితాలు ప్రభుత్వ పథకాలకు, అధికారుల కనికరానికి ఆమదదూరంలో నిలిచిపోతున్నాయి.. వైద్యులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు రాకపోవడం వల్ల పిల్లలు ఆటపాటలకు దూరమై స్మార్ట్‌ఫోన్ గదుల్లో బందీలుగా మారుతుంటే, వీధుల్లో బతుకుపోరాటం చేస్తున్న అభాగ్యులైన చిన్నారుల సంఖ్యపై కనీస స్పష్టత లేకపోవడం వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలబాలికల సంఖ్య ఎంత అని అడిగితే తక్షణమే సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొనడం గమనార్హం. కన్నవారు దూరమై, దిక్కులేని వారైన చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం వరకే అధికార యంత్రాంగం పరిమితమవుతోంది. తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్లు), ఇతర పత్రాలు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలని నిబంధనలు పెట్టడం విడ్డూరంగా మారింది. అసలు దిక్కులేక రోడ్డున పడ్డ పసిపిల్లలకు ఆ పత్రికా ప్రకటనలు ఎలా తెలుస్తాయి.. వారి తరఫున కార్యాలయాల చుట్టూ తిరిగి దరఖాస్తులు నింపే పెద్దదిక్కు ఎక్కడి నుంచి వస్తుంది.. గతంలో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం నగర్ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు తల్లిదండ్రులను కోల్పోయి, ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం కోసం దాదాపు ఆరేళ్ల పాటు చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడం ఇక్కడి స్థితిగతులకు నిదర్శనం. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తున్నామని, పనుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి బడిబాట పట్టిస్తున్నామని అధికారిక గణాంకాలు చెబుతున్నప్పటికీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. నిర్మల్ పట్టణంతో పాటు భైంసా, ముధోల్, ఖానాపూర్, కడెం వంటి ప్రధాన ప్రాంతాల్లో నేటికీ ఎందరో చిన్నారులు వీధుల్లో కాగితాలు ఏరుకుంటూ, చిరు పనులు చేస్తూ కనిపిస్తూనే ఉన్నారు. బాలల సంరక్షణ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కార్యాలయాల్లో కూర్చుని చెప్పడం కంటే, అధికారులే స్వచ్ఛందంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి అనాథలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగిస్తున్న యువతులు, ఎదిగిన ఆడపిల్లలకు 'మేమున్నాం' అనే భరోసా కల్పిస్తూ, అనాథ కోటా కింద ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా యంత్రాంగం అడుగులు వేయాలి. కేవలం పట్టణ కేంద్రాల్లో జరిగే సభలు, సమావేశాలతో బాలల హక్కులు నెరవేరవు. మారుమూల పల్లెల్లో అనాథలుగా మిగిలిన ప్రతి చిన్నారి వివరాలు అధికారుల వద్ద పక్కాగా ఉండాలి. ఏ ఒక్క చిన్నారి కూడా పత్రాల కొరతతో ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా, స్వయంగా అధికారులే వారి ఇళ్ల వద్దకు వెళ్లి సహాయం అందించేలా వ్యవస్థలో మార్పు రావాలి. అదే సమయంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సెల్‌ఫోన్ వ్యసనం నుండి బయటకు తెచ్చి, ఆరోగ్యకరమైన ఆహారం, నైతిక విలువలతో పెంచినప్పుడే నిజమైన బాలల దినోత్సవానికి సార్థకత చేకూరుతుందని ముక్త కంఠంతో చెప్పడంలో సందేహాలు అవసరం లేదు.



వ్యాసకర్త..
చేపూరి సత్యనారాయణ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్, సెల్:97054 44261

నేడు బాలల దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం.

నేర నియంత్రణ, శాంతి భద్రత పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి
- విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి రివార్డులు, ప్రశంసా పత్రాలు



జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 13 :

సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూనే, జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాల పరిస్థితి, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, చార్జ్‌షీట్లు, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల నిర్వహణ, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారుల భద్రత, తదితర అంశాలపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, విచారణా వ్యవస్థను వేగవంతం చేయడం, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం ,ప్రతి కేసు విచారణ నాణ్యతతో పాటు సాక్ష్యాధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ అప్‌డేషన్, ఈ-సాక్ష్య ఐరాడ్ అప్లికేషన్ల వినియోగం, వాటి అప్‌డేషన్‌పై సమీక్షించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పోలీస్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకొని కోర్టుల్లో కన్విక్షన్ రేట్ పెంచేలా కృషి చేయాలి అన్నారు. మహిళా భద్రత, మత్తుపదార్థాల నివారణ , చోరీలు వంటి అంశాలపై క్షుణ్ణంగా విశ్లేషించారు. ప్రతి స్టేషన్‌లో విజబుల్ పోలీసింగ్ పెంచాలని, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పి నమ్మకం పెంచేలా ప్రవర్తించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల్లో అవగాహన కల్పించడంలో సైబర్ టీములు చురుకుగా పనిచేయాలని సూచించారు.నేర నియంత్రణలో భాగంగా సొసైటీ పర్ పబ్లిక్ సేఫ్టీ లో బాగంగా ప్రతి పట్టణంలోని కాలనీల్లో,గ్రామాలలో,సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేల ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పోక్సో, గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబరుస్తూ, ఫంక్షనల్ వర్టికల్స్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సిబ్బందిని, నేరస్తులకు శిక్ష పడేలా కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు చేసి కోర్టుల్లో నేర నిర్ధారణకు కృషి చేస్తున్న పోలీసు సిబ్బందిని గుర్తించి రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈసమావేశంలో అదనపు ఎస్పి చేతన్ నితిన్, డిఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవి కుమార్, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, రామ్ నర్సింహా రెడ్డి, సుధాకర్, సురేష్ బాబు, శ్రీనివాస్, తిరుపతి, కరుణాకర్, రాజ్ కుమార్, వేణు, సైదులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యాసంగి పంటల సాగుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

సిరిసిల్ల, నవంబర్ 13, : యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వరి సాగును నియంత్రించి ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్య, భూసేకరణ, వీబీజీ రామ్ జీ పనులు, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు మళ్లించాలని, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహ కాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా పర్యవేక్షించాలని, విద్యార్థుల హాజరు కనీసం 90శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు డిజిటల్ అభ్యాసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరి సాగును నియంత్రిస్తూ ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామకృష్ణ, నీటిపారుదల శాఖ అధికారి యుగంధర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా నాయక్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, ఎస్‌డీసీ మోహన్ సింగ్, పర్యాటక, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రెగ్నెంట్ అయితేనేంటి?

సినిమాలకు గుడ్ బై చెప్పేది లేదు..

కియారా అద్వానీ సంచలన వ్యాఖ్యలు!

ముంబై, నవంబర్ 13 (చురకలు): మాతృత్వం కారణంగా సినిమాలకు దూరమవుతానని భావించడం సరికాదని బాలీవుడ్ నటి కియారా అద్వానీ స్పష్టం చేశారు. కుటుంబ జీవితంలో స్థిరపడేందుకు నటనకు గుడ్‌బై చెప్పబోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను ఆమె తోసిపుచ్చారు. తనకు నచ్చిన సినిమాలు, పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ తనకుందని, వ్యక్తిగత జీవితంతోపాటు సినీ ప్రయాణాన్ని కూడా కొనసాగిస్తానని వెల్లడించారు. భర్త సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి కరణ్ జోహర్ నిర్వహించే 'కాఫీ విత్ కరణ్' తొమ్మిదో సీజన్‌లో పాల్గొన్న సందర్భంగా కియారా తన వ్యక్తిగత జీవితం, సినీ కెరీర్‌పై మాట్లాడినట్లు కథనాలు వెలువడ్డాయి. రెండోసారి గర్భవతి అంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తన కలలను సాకారం చేసుకునే విషయంలో వెనక్కి తగ్గబోనని, మాతృత్వం నటనా జీవితానికి అడ్డంకి కాదని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు 'టాక్సిక్' చిత్రం వైఫల్యం తనను తీవ్రంగా బాధించిందని కియారా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సినిమాలోని సన్నిహిత సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విమర్శలు తనను కుంగదీశాయని, ఆ కష్టకాలంలో సిద్ధార్థ్ మల్హోత్రా తనకు అండగా నిలిచారని వెల్లడించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. 'లస్ట్ స్టోరీస్'లో తన నటనను చూసిన తర్వాత సిద్ధార్థ్ తనపై ఆసక్తి పెంచుకున్న విషయాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నట్లు సమాచారం. వివాహం, మాతృత్వం కారణంగా నటీమణులు తమ వృత్తిని వదులుకోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని కియారా వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు నిర్ణయాలను తానే తీసుకుంటానని, సినిమాల్లో నటించడం కొనసాగిస్తానని స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

దాదా ధమాకా.. దద్దరిల్లిపోతోంది ఇలాకా!

'స్టేట్ అంతా అదిరిపోద్ది.. నిదరంతా చెదిరిపోద్ది' అంటూ బాలయ్య మాస్ రచ్చ



హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): నటసింహం నందమూరి బాలకృష్ణ మరోసారి తనదైన మాస్ మేనియాతో అభిమానులను ఉర్రూతలూగిస్తున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'దాదా' నుంచి విడుదలైన తొలి గీతం 'దాదా ధమాకా' సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'స్టేట్ అంతా అదిరిపోద్ది.. నిదరంతా చెదిరిపోద్ది' అంటూ సాగే ఈ పాటకు సంగీత దర్శకుడు ఎస్.థమన్ అందించిన ఊరమాస్ బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలయ్య ఎనర్జీ, మాస్ స్టెప్పులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ నటిస్తుండగా, మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. ప్రత్యేక గీతంలో బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ తన అందాలు, నృత్యాలతో ఆకట్టుకుంటోంది. రామజోగయ్యశాస్త్రి అందించిన సాహిత్యానికి థమన్ సంగీతం తోడవగా, బాలకృష్ణ స్వయంగా పాటకు గొంతు కలపడం మరో విశేషం. ఆయన గంభీరమైన గాత్రం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ రూపొందించిన మాస్ స్టెప్పులతో బాలయ్య తనదైన శైలిలో అదరగొట్టారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచగా, తాజాగా వచ్చిన పాట మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఈ పాటతో అభిమానులు రూపొందిస్తున్న చిన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. మరోవైపు బాలకృష్ణకు ప్రమాదం జరగడంతో కొంతకాలం నిలిచిపోయిన చిత్రీకరణ ఇటీవల తిరిగి ప్రారంభమైంది. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో వస్తున్న 'దాదా' ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

'పిచ్చి ప్రేమలో' ముంచేసిన నితిన్..

మనసు దోచే మెలోడీ!

'అలియాస్ రుక్మిణి' నుంచి రెండో గీతం విడుదల ■ డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): యువ కథానాయకుడు నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' నుంచి మరో మధురమైన ప్రేమగీతం ప్రేక్షకుల ముందుకొచ్చింది. నేచురల్ స్టార్ నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి గంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ, వినోదం కలగలిసిన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'రుక్మిణి' పాటకు మంచి స్పందన లభించగా, తాజాగా రెండో గీతం 'పిచ్చి ప్రేమలో'ను చిత్రబృందం విడుదల చేసింది. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ పాట మధురమైన బాణీలతో ఆకట్టుకుంటోంది. గాయకుడు కార్తీక్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోయగా, గీత రచయిత కృష్ణకాంత్ భార్యపై భర్తకున్న ప్రేమను అందమైన పదాలతో ఆవిష్కరించారు. భార్య అల్లరి, అలకలు, చిన్నచిన్న సరదాలను ప్రేమగా ఆస్వాదించే భర్త మనోభావాలను ఈ గీతంలో చూపించారు. ఈశ్వర్ పెంటి రూపొందించిన నృత్యరీతులు పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన దంపతుల మధ్య ఉండే ప్రేమానురాగాలను సహజంగా చిత్రీకరించారు. భార్యాభర్తలు కలిసి బయటకు వెళ్లడం, భర్త తన భార్యను పాఠశాల వద్ద దింపడం వంటి సన్నివేశాలు మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సాధారణ మధ్యతరగతి భర్త పాత్రలో నితిన్ సహజంగా కనిపించగా, సంప్రదాయ దుస్తుల్లో ఆఫియా సయ్యద్ ఆకట్టుకున్నారు. వీరిద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి జోమోన్ టి.జాన్ ఛాయాగ్రహణం, అవినాష్ కొల్లా నిర్మాణ రూపకల్పన, సృజన ఆదుసుమిల్లి కూర్పు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రచార చిత్రాలు, పాటలతో ఆసక్తి రేకెత్తిస్తున్న 'అలియాస్ రుక్మిణి' డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది.



లాయర్‌గా కీర్తి సురేశ్!

ఆసక్తి రేపుతున్న 'సత్యవాన్ సావిత్రి' ట్రైలర్

వినోదం, కోర్టు డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం

హైదరాబాద్, నవంబర్ 13 (చురకలు): జాతీయ ఉత్తమ నటి కీర్తి సురేశ్ మరో విభిన్న పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో వినోదం, కోర్టు డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా కనిపిస్తూ ఆసక్తి రేకెత్తిస్తున్నారు. బలవంతపు వివాహంతో ఒక్కటైన దంపతుల జీవితంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడం, భర్త హత్య కేసులో చిక్కుకోవడం కథలో కీలక మలుపులుగా కనిపిస్తున్నాయి. తనకు ఇష్టం లేకుండా పెళ్లి జరిగినప్పటికీ హత్య కేసులో చిక్కుకున్న భర్తను రక్షించేందుకు భార్య న్యాయవాదిగా ఎలాంటి పోరాటం చేసింది? అసలు ఆ హత్య వెనుక ఉన్న నిజాలేమిటి? అనే అంశాల చుట్టూ కథ సాగనుంది. వినోదంతోపాటు ఉత్కంఠభరితమైన న్యాయస్థాన సన్నివేశాలకు ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇప్పటివరకు విభిన్న పాత్రలతో మెప్పించిన కీర్తి సురేశ్ న్యాయవాదిగా ఎలాంటి నటన కనబరుస్తారనే ఆసక్తి నెలకొంది. నవంబర్ 20న 'సత్యవాన్ సావిత్రి' ప్రేక్షకుల ముందుకు రానుంది.



వీస్ చేతిలో టీమిండియా చిత్తు

- 244 పరుగుల తేడాతో ఘోర పరాజయం
- 89 పరుగులకే కుప్పకూలిన భారత బ్యాటింగ్ లైనప్
- నిప్పులు చెరిగిన మాట్ హెన్రీ.. 27 పరుగులిచ్చి 6 వికెట్లు
- తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్ పెవిలియన్‌కు



మౌంట్ మౌంగనుయ్ (న్యూజిలాండ్), నవంబర్ 13 (చురకలు): న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు ఊహించని రీతిలో ఘోర పరాభవం ఎదురైంది. మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య కివీస్ జట్టు 244 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా తేలిపోయిన రోహిత్ సేన, వన్డే క్రికెట్ చరిత్రలోనే తమ అత్యంత చెత్త ప్రదర్శనల్లో ఒకదానిని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 333 పరుగుల భారీ స్కోరు సాధించగా.. అనంతరం 334 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్ కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు ఓపెనర్ విల్ యంగ్ గట్టి పునాది వేశాడు. భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయిస్తూ 125 పరుగులతో అద్భుతమైన శతకం బాదాడు. అతని మెరుపు సెంచరీకి తోడు మిగతా బ్యాటర్లు కూడా రాణించడంతో కివీస్ జట్టు 333 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది. మౌంట్ మౌంగనుయ్ పిచ్‌పై భారత్ ముందు 334 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ మాట్ హెన్రీ నిప్పులు చెరిగే బంతులతో భారత టాపార్డర్‌ను కకావికలం చేశాడు. తన స్పెల్ తొలి ఓవర్‌లోనే కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, మిడిలార్డర్ కీలక ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌లను పెవిలియన్‌కు పంపి టీమిండియా వెన్నువిరిచాడు. ఆ ఆరంభ షాక్ నుంచి భారత జట్టు ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. హెన్రీ ధాటికి భారత బ్యాటర్లు క్రీజులో నిలవలేక ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ బాట పట్టారు. అద్భుత బౌలింగ్‌తో భారత్ పతనాన్ని శాసించిన మాట్ హెన్రీ కేవలం 27 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా టీమిండియా కనీసం 100 పరుగుల మార్కును కూడా దాటలేక 89 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ భారీ పరాజయంతో వన్డే క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా భారత్ ఎదుర్కొన్న అతిపెద్ద ఓటముల జాబితాలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. 2000 సంవత్సరంలో షార్జా వేదికగా శ్రీలంక చేతిలో 245 పరుగుల తేడాతో ఓడిపోవడం ఇప్పటికీ భారత్‌కు అత్యంత భారీ ఓటమిగా మొదటి స్థానంలో కొనసాగుతోంది. తాజాగా 2026లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఈ 244 పరుగుల పరాజయంతో టీమిండియా ఈ జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. కేవలం ఒక్క పరుగు తేడాతో తమ 26 ఏళ్ల నాటి అత్యంత చెత్త రికార్డును అధిగమించే ప్రమాదం నుంచి భారత్ తృటిలో తప్పించుకుంది.



అంబేకర్, గుంజన్ స్వర్ణ చరిత్ర

యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్ గోల్డెన్ పంచ్‌లు

డాకర్ (సెనెగల్), నవంబర్ 13 (చురకలు): ప్రతిష్టాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత యువ బాక్సర్లు అంబేకర్ మీతేయి, గుంజన్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ గేమ్స్ చరిత్రలో దేశానికి స్వర్ణ పతకాలు అందించిన బాక్సర్లుగా రికార్డుకెక్కారు. గురువారం జరిగిన ఫైనల్స్‌లో ఈ ఇద్దరూ గోల్డెన్ పంచ్‌లు విసిరారు. తొలుత పురుషుల 50 కేజీల తుదిపోరులోఅంబేకర్ 3-2తో ఐర్లాండ్ బాక్సర్ క్రిస్టియన్ జుబానిపై ఉత్కంఠ విజయం సాధించి యూత్ ఒలింపిక్ చాంపియన్ గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో జుబాని నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ ఒత్తిడికి తడబడకుండా పోరాడిన అంబేకర్ విజయం సొంతం చేసుకున్నాడు. యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో శివ థాపా 2010 ఎడిషన్‌లో (60 కేజీల విభాగం) సాధించిన రజత పతకమే భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన కాగా.. ఇన్నేండ్లకు అంబేకర్ ఆ రికార్డులను బద్దలు కొట్టాడు. అనంతరం మహిళల 48 కేజీల విభాగంలో ఫైనల్లో అసాధారణ ప్రదర్శన చేసిన గుంజన్ 5-0తో బెన్సలా బుథియానా (అల్జీరియా)ను చిత్తు చేసింది. మూడు రౌండ్లలోనూ స్పష్టమైన పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసి పసిడి సొంతం చేసుకుంది.

ఖవాజాను బలిపశువును చేశారు

- కమిన్స్‌పై వార్నర్ సంచలన ఆరోపణలు!
- ఆస్ట్రేలియా క్రికెట్‌లో మళ్లీ బాల్ ట్యాంపరింగ్ వివాదం
- ఎనిమిదేళ్ల నాటి శాండ్‌పేపర్ ఉదంతంపై మాటల యుద్ధం



పెర్త్ (ఆస్ట్రేలియా), నవంబర్ 13 (చురకలు): ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన ఎనిమిదేళ్ల నాటి బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో జరిగిన శాండ్‌పేపర్ ఉదంతంపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తీవ్రంగా తప్పుబట్టాడు. నిజాలు వెల్లడిస్తున్న ఉస్మాన్ ఖవాజాను కమిన్స్ బలిపశువును చేశాడంటూ సంచలన ఆరోపణలు చేశాడు. దీంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో పాత వివాదం కొత్త చర్చకు దారితీసింది. ఉస్మాన్ ఖవాజా రాసిన 'సర్వ' ఆత్మకథ ఈ వివాదానికి కారణమైంది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన కేప్‌టౌన్ టెస్టులో బంతిని శాండ్‌పేపర్‌తో రుద్దే విషయం జట్టులోని అందరికీ తెలుసని ఖవాజా తన పుస్తకంలో పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలను కమిన్స్ తీవ్రంగా ఖండించాడు. శాండ్‌పేపర్ వినియోగం గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని, అందరికీ తెలుసనడం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో పెర్త్‌లో ఓ క్రీడా ప్రసార సంస్థతో మాట్లాడిన వార్నర్ ఖవాజాకు అండగా నిలిచాడు. ఖవాజా తన పుస్తకంలో రాసిన విషయాలు నిజమేనని, అతడిని కమిన్స్ తప్పుబట్టడం బాధాకరమని పేర్కొన్నాడు. అప్పట్లో జరిగిన విచారణ కూడా లోపభూయిష్టంగా సాగిందని విమర్శించాడు. మరోవైపు సిడ్నీలో మీడియాతో మాట్లాడిన కమిన్స్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చాడు. బాల్ ట్యాంపరింగ్ కుట్రలో తన ప్రమేయం లేదని, ఎనిమిదేళ్లుగా ఇదే విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశాడు. 2018 మార్చిలో కేప్‌టౌన్ టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా విచారణ జరిపి అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌లపై ఏడాది పాటు, బెన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల పాటు నిషేధం విధించింది. తాజాగా ఖవాజా ఆత్మకథతో ఆ వివాదం మళ్లీ రాజుకోవడంతో వార్నర్, కమిన్స్ మధ్య మాటల యుద్ధం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.




తెలుగు బ్లాక్‌హాక్స్ విజయం

హైదరాబాద్, , నవంబర్ 13 (చురకలు): ప్రైమ్ వాలీబాల్ లీగ్ తెలుగు బ్లాక్‌హాక్స్ జట్టు తెలుగు స్వాగ్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ (కేఎస్‌జీ)ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగిన తుదిపోరులో ఆ జట్టు 5-0తేడాతో బ్లాక్‌హాక్స్ అకాడమీపై ఘనవిజయం సాధించింది. శాప్ వీసీ ఎండీ ఎస్. భరణితో కలిసి కేఎస్‌జీ చైర్మన్ కె. అభిషేక్‌రెడ్డి విజేతకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని వాలీబాల్ ప్రతిభను వెలికితీసి, యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించడమే తమ తెలుగు బ్లాక్‌హాక్స్ ఫ్రాంచైజీ ప్రధాన లక్ష్యమని తెలిపాడు. ఆగస్టులో నిర్వహించిన ట్రయల్స్ ద్వారా సిరిల్ రెడ్డి (వరంగల్), విష్ణువర్ధన్ బాబు (యానం), నమిత్, మునీష్ వెంకటేశన్, దీపక్ పీవీఎల్ ఐదో సీజన్ తెలుగు బ్లాక్‌హాక్స్ జట్టులో చోటు సంపాదించారని, మరో 12 మంది ప్రతిభావంతులను తమ అకాడమీ జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు.

రోహిత్, ఇషాన్ తప్పిదాలు

- ఐదు పరుగుల నుంచి 125 రన్స్‌కు విల్ యంగ్!
- ఆరంభంలోనే రెండు సులభమైన క్యాచ్‌లు వదిలేసిన భారత్



ఓవెల్, నవంబర్ 13 (చురకలు): భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఓవెల్ వేదికగా జరుగుతున్న నాలుగో వన్డే మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్ విల్ యంగ్ అద్భుత సెంచరీతో మెరిశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు యంగ్ భారీ స్కోరు అందించాడు. 108 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 125 పరుగులు చేశాడు. అయితే అతడు సాధించిన ఈ సెంచరీ వెనుక టీమిండియా ఫీల్డర్ల తప్పిదాలు కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ ఇచ్చిన రెండు క్యాచ్ అవకాశాలను యంగ్ సద్వినియోగం చేసుకుని శతకం బాదాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే విల్ యంగ్‌కు ఊహించని రీతిలో రెండు జీవనదానాలు లభించాయి. అతడు వ్యక్తిగత స్కోరు ఐదు పరుగుల వద్ద ఉన్నప్పుడు భారత బౌలర్ జెకిబ్ నబీ వేసిన రెండో ఓవర్ ఐదవ బంతికి తొలి లైఫ్ దక్కింది. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ సులభమైన క్యాచ్‌ను జారవిడిచాడు. ఆ తర్వాతి బంతికే మరోసారి యంగ్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. యంగ్ బ్యాట్‌ను తాకిన బంతి వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ వైపు వెళ్లగా.. ఇషాన్ కూడా ఆ క్యాచ్‌ను అందుకోలేకపోయాడు.

భారత్‌ను దెబ్బతీసిన తప్పిదాలు

వరుస బంతుల్లో లభించిన ఈ రెండు అవకాశాలు న్యూజిలాండ్ బ్యాటర్‌కు పూర్తిగా కలిసొచ్చాయి. ఐదు పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరాల్సిన విల్ యంగ్.. ఆ లైఫ్‌లను ఉపయోగించుకుని భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత బౌండరీలతో పరుగుల వేగాన్ని పెంచాడు. ఈ క్రమంలో 88 బంతుల్లోనే 11 ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్‌పై అతడికిదే తొలి వన్డే సెంచరీ కాగా.. అంతర్జాతీయ వన్డే కెరీర్‌లో ఐదో శతకం కావడం విశేషం. సెంచరీ తర్వాత కూడా దూకుడు కొనసాగించిన యంగ్, చివరకు 37వ ఓవర్లో నమన్ ధీర్ బౌలింగ్‌లో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కుమార్ కుశాగ్రకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఒకవేళ ఆరంభంలో రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్‌లలో ఎవరో ఒకరు ఆ క్యాచ్ పట్టి ఉంటే విల్ యంగ్ ఇన్నింగ్స్ ఐదు పరుగులకే ముగిసేది. కానీ రెండు అవకాశాలు చేజారడంతో అతడు ఏకంగా 125 పరుగులు సాధించి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కీలక సమయంలో క్యాచ్‌లు వదిలేయడం టీమిండియాకు ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఇన్నింగ్స్ మరోసారి రుజువు చేసింది.



క్వార్టర్స్‌లో శ్రీకాంత్, లక్ష్య

కుమమోటో: జపాన్ మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ లో మాజీ నంబర్ వన్ శ్రీకాంత్ 21-15, 11-21, 21-18తో ఐదో సీడ్, 8వ ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)కు షాకిచ్చిచ్చాడు. మరో మ్యాచ్ లో ఎనిమిదో సీడ్ లక్ష్యసేన్ 21-8, 21-14తో డోంగ్ టియాన్ (చైనా)ను ఓడించి ముందంజ వేశాడు. కానీ మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి- ట్రీసా జాలీ 14-21, 14-21తో మూడో సీడ్ ఇవనగా-నకనిషి (జపాన్) చేతిలోఓడిపోయింది.





కలిసి ఎదుగుదాం





ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం...

జారీ చేసిన వారు: సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com